


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...
గ్రేటర్ హైదరాబాద్
శనివారం 7 ఫిబ్రవరి 2026 పేజీలు 10

శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని

## అన్ని రంగాల్లో అభివృద్ధి..

▶▶ పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ▶▶ ఆల్విన్ కాలనీ డివిజన్‌లో

**రూ.1.12 కోట్లతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన**



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.1 కోటి 12 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు
కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి
పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శుక్రవారం శంకుస్థాపన చేశారు.
సాయి హిల్స్, పీజేఆర్ నగర్, ఎన్టీఆర్ నగర్, మొగులమ్మ బస్తీ, తారక రామ నగర్, మహాత్మ గాంధీ నగర్, రైతు బజార్ రోడ్డు, జయశంకర్ కాలనీ, ఈస్ట్ సాయి నగర్, వెస్ట్ సాయి నగర్ కాలనీల్లో ఈ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీల్లో రవాణా సమస్యలు తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని తెలిపారు. పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని గాంధీ పేర్కొన్నారు.

## డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం...

**చందానగర్‌లో కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డితో కలిసి యూజీడీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ**



చందానగర్,మేజర్ న్యూస్ : డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించే దిశగా పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని చందానగర్ డివిజన్ తార నగర్, శివాజీ నగర్, హుడా ఫేస్ 2, చందానగర్, గౌతమి నగర్,వేముకుంట వీకర్ సెక్షన్, ఫ్రెండ్స్ కాలనీ, భవానిపురం వీకర్ సెక్షన్ కాలనీలలో రూ.1 ఒక కోటి 81 లక్షల 45 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి,జలమండలి అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవిష్యత్తులో డ్రైనేజీ సమస్యలు పునరావృత అవ్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై ఇంజనీర్లతో చర్చించి నూతన యూజీడీ లైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం శ్రీమాన్ నారాయణ, మేనేజర్ శిరీష ,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, స్థానిక వాసులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సాగర్ పంప్ హౌస్ పనులు

## వేగవంతం చేయండి

**జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశం**




హైదరాబాద్ మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి):హైదరాబాద్ నగరానికి 20 టీఎంసీల అదనపు నీటిని తరలించడానికి, మూసీ పునరుజ్జీవనం కోసం, జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి రూ.7,360 కోట్ల వ్యయంతో.. గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ -2?3 ప్రాజెక్టు రా వాటర్ పంప్ హౌస్ నిర్మాణ పనులలో వేగం పెంచాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మిగతా 3లో

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే పద్మారావు



సీతాఫలమండి, మేజర్ న్యూస్: ప్రతి ఇంటికి వివిధ సంక్షేమ పథకాలను చేర్చిన ఘనత గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని, పేద ప్రజలకు ప్రయోజనం కలిగించే కార్యక్రమాలకు ప్రాముఖ్యతను కల్పించి పేదలకు వివాహాలు భారంగా మారకుండా ఏర్పాట్లు జరిపామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 152 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను శక్రవారం మధురానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పద్మారావు గౌడ్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికింద్రాబాద్ కు చెందిన అత్యధికులకు గతంలో వివిధ సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పించామని తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, ప్రజలకు నిరంతరం తాము అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, రాసురి సునీత, తసిల్దార్లు ప్రతాప్ సింగ్, అసదుల్ల ఖాన్, సమన్వయకర్త రాజ సుందర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 93 మందికి కళ్యాణ లక్ష్మి, 59 మందికి షాదీ ముబారక్ చెక్కులు పద్మారావు గౌడ్ అందించారు.

# గద్దర్ ఆలోచనలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోంది

-రాష్ట్ర డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు - గద్దర్ ఫిలిం అవార్డుల సినీమా స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర డిప్యూటీ సి.ఎం....



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః వచ్చే ఉగాది రోజున గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ కార్యక్రమాన్ని నభూతో నభవిష్యత్తు అన్న చందంగా ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించి, ప్రపంచ ఫిలిం ఇండస్ట్రీ మొత్తం హైదరాబాద్ వైపు తిరిగి చూసేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని,అందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అందిస్తుందని రాష్ట్ర డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రసాద్ ల్యాబ్స్‌లో గద్దర్ ఫిలిం అవార్డుల సందర్భంగా సినీమాల స్క్రీనింగ్ ప్రక్రియ కార్యక్రమాన్ని డిప్యూటీ సి.ఎం. లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మాట్లాడుతూ సామాజీక మార్పుకోసం కలలను ఉపయోగించి, ప్రజలకోసం తన జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గద్దర్ అని ఆయన అందించిన సేవల గురించి కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఆయన పేరిట సినీమా అవార్డును ప్రారంభించిందని,ఇది రెండవ సంవత్సరంఅని,వచ్చే ఉగాది పర్వదినం రోజు ఘనంగా గద్దర్ ఫిలిం అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆయన చెప్పారు. గద్దర్ చివరి రోజుల్లో వారితో తాను ఏక్కువ కాలం గడిపానని, వారి స్టూడియోలో ఆనేక ప్రయోగాత్మక పాటలు పాడారని,చివరి రోజుల్లో గద్దర్ రికార్డింగ్ స్టూడియోలో ఏక్కువ రోజులు గడిపారని ఆయన గుర్తు చేశారు. తెలుగు సినీ పరిశ్రమలోని అన్ని విభాగాలకు అవార్డులను ఇవ్వ బోతున్నట్లు,హైదరాబాద్ కేవలం తెలుగు ఇండస్ట్రీకేకాదు,యావత్తు భారతదేశంలోని వివిధ భాషలకుహైదరాబాద్ కేంద్రంగా మారాలన్నదే ప్రజా ప్రభుత్వం గొప్ప సంకల్పంతో పనిచేస్తుందన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ సినీ కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బ్లూ ప్రింట్ తయారు చేసుకుని ముందుకు పోతుందన్నారు. తెలుగు సినీమా ఇండస్ట్రీ ఆస్కార్ వంటి ప్రపంచ స్థాయి అవార్డులను సాధించడం గర్వించదగిన అంశం,అటువంటి అంశాలను పునాదిగా చేసుకుని హైదరాబాద్ ప్రపంచ సినీ కేంద్రంగా మార్చాలనే ఆలోచనలతో సి.ఎం. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. మున్సిపల్ ఎన్నిల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు,సినీమాటోగ్రాఫి మంత్రి వెంకట్‌రెడ్డి అందుబాటులో లేరని,మీ అందరిని ప్రొత్సహించాలనేది మా అందరి ఏకైక లక్ష్యం అనే సందేశాన్ని మీ అందరికి తెలియజేయవల్సింది తనకు తెలియజేయడం జరిగిందన్నారు. గద్దర్ ఫిలిం అవార్డుల కార్యక్రమాన్ని కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు మనస్ఫూర్తిగా తీసుకుని బాధ్యతాయుతంగా ముందుకు వెళ్ళుతున్నారని ఆయన అభినందించారు. సినీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, సినీ కార్మికులకోసం,సినీ రంగం అభివృద్ధికసం ప్రభుత్వం ఏలాంటి కార్యక్రమాలు చేయాలని ఆలోచనలను సైతం దిల్‌రాజు తమతో పంచుకుంటున్నారని ఆయన చెప్పారు. జ్యూరీ చైర్మన్ మణిశర్మ తెలియనివారు సినీ రంగంలో లేరని,తమతమ బేధాలు లేకుండా, పారదర్శకంగా సినీమాలు చూడడమేకాదు నిష్పక్షపాతంగా అవార్డుల ఏంపిక కార్యక్రమాలన్ని చేపట్టాలన చైర్మన్‌తో జ్యూరీ సభ్యులను కోరుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఫ్డిసి చైర్మన్ దిల్‌రాజు,స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మణిశర్మ,ఏఫ్డిసిఏగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



# శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

కాచిగూడ ఇన్స్పెక్టర్ ఎస్.రాజశేఖర్



రవీంద్ర భారతి, మేజర్ న్యూస్ 6: శాంతి భద్రతల పరిరక్షణ కోసం బస్తీ, వివిధ కుల సంఘాలు, పీస్ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని కాచిగూడ ఇన్స్పెక్టర్ ఎస్.రాజశేఖర్ అన్నారు . 2007 బ్యాచ్ కు చెందిన కాచిగూడ నూతన ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన రాజశేఖర్ ను కాచిగూడ పీఎస్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కాచిగూడ గౌడ సంఘం అధ్యక్షుడు భీమాగౌని కృష్ణగౌడ్ మార్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, మహేందర్,బి.మహేందర్ గౌడ్, బి. నితిశ్రా గౌడ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు సినీ సంగీత విభావరి!



ముషీరాబాద్ మేజర్ న్యూస్ :స్వర ఝరి భువన భాస్కర సంగీత సాహిత్య సేవా సమితి మరియు భార్గవ స్వరాలు5 భక్తి సినీ సంగీత విభావరి వారి ఆధ్వర్యంలో 109వ సంగీత విభావరిని పాటల అభిమానుల ముందుకు తీసుకువస్తున్నారు దీనికి ఈటీవీ పాడుతా తీయగా ఫేమ్ సాయి కిరణ్ , కీబోర్డు ప్లేయర్ మోహన్ , తబలాయిస్ట్ మరియు శివరాం రిథమ్ పాడ్స్ వారి వాయిద్య సహకారంతో ఈ కార్యక్రమానికి నిర్వహిస్తున్నారు. ఇందులో భార్గవరామ్ రచించిన భక్తి పాటలు మరియు సినీ గీతాలు ఉదయ రాష్ట్రాల గాయని గాయకులు ఈ కార్యక్రమంలో వారి గళాలతో వినిపించనున్నారు అలాగే భార్గవరామ్ కి ప్రముఖ సంగీత విద్య గురువు శ్రీలత కు ప్రముఖ రచయిత అనురాధ కి సన్మాన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న పివి ఆంజనీ కుమారి నైటేంగిల్ ఆఫ్ ఇండియా అధికార గౌడ్ గెస్టుగా ఈ కార్యక్రమానికి విచ్చేయనున్నారు ఈ విషయాన్ని నిర్వాహకులు సంస్థ ప్రెసిడెంట్ శ్రీమతి భువనరాధ గారు ఒక ప్రకటనలో చెప్పారు.

# రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కమీషనర్ రాజీవ్ గాంధీ హనుమంత్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన ఎస్.ముజీబ్‌హుస్సేనీ



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః గ్రేడ్-2 సీనియర్లకు ప్రమోషన్లను కల్పించాలని,ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని,ఆవుట్ సోర్సింగ్,రెగ్యూలర్ ఉద్యోగుల బదిలీలను త్వరితగతిన చేపట్టాలంటూ టి.ఎన్.జి.ఓ.కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎస్. ముజీబ్‌హుస్సేనీ శుక్రవారం మెజంజాహీ మార్కెట్ చౌరస్తాలోని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్టుమెంట్ కమీషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ప్రధాన కార్యాలయంలో శాఖ కమీషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతును మర్యాద పూర్వకంగాకల్సి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముజీబ్‌హుస్సేనీ మాట్లాడుతూఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చొరవ తీసుకోవాలని కమీషనర్‌కు ప్రత్యేకంగా విన్నవించారు. అందుకు శాఖ కమీషనర్ స్పందించి,తప్పకుండా గ్రేడ్ -2 సీనియర్ల ప్రమోషన్లు, ఉద్యోగుల బదిలీలు,ఆవుట్ సోర్సింగ్,రెగ్యూలర్ ఉద్యోగుల బదిలీలను చేపట్టేందుకు సానుకూలంగా స్పందించినట్లు ముజీబ్‌హుస్సేనీ తెలిపారు. రాష్ట్ర కమీషనర్‌నుకల్సిన వారిలో కేంద్ర సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకట్,హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీకాంత్‌లు ఉన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



అమీర్ పేట,మేజర్ న్యూస్:ఆర్థిక ఇబ్బందుల కారణంతో నిరుపేదలు వైద్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే తన లక్ష్యమని సనత్ నగర్ ఎమ్మెల్యే, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ. 25.96 లక్షల విలువైన చెక్కులను 68 మంది లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం వైద్యం అత్యంత ఖరీదుగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో నిరుపేదలు ఆర్థిక స్థోమత లేక ప్రాణాంతక వ్యాధులకు చికిత్స చేయించుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఒక గొప్ప వరమని, దీనిని సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యం పొంది ఆరోగ్యవంతులుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఏ సమయంలోనైనా నియోజకవర్గ ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి, టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరల్డ్ పికిల్‌బాల్ లీగ్‌లో సియోన్ మెండెజ్ అజేయ ప్రదర్శన



హైదరాబాద్, మేజర్ న్యూస్ : వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ లీగ్ దశలో హైదరాబాద్ సూపర్‌స్టార్స్ తరఫున ఆడుతున్న సియోన్ మెండెజ్ అజేయ పరంపర కొనసాగించింది. బెంగళూరు జవాన్స్‌కు చెందిన కటెరినా స్టీవర్ట్‌పై విజయం సాధించి మహిళల సింగిల్స్ విభాగంలో తన ఆధిపత్యాన్ని చూపించింది. లీగ్ దశలో ఆడిన6 మ్యాచ్‌లన్నింటిలోనూ ఆమె ఓటమి లేకుండా నిలిచింది.లీగ్‌లో అజేయంగా కొనసాగడం తన క్రమశిక్షణ, ఫిట్‌నెస్, మానసిక సిద్ధతకు ఫలితమని సియోన్ తెలిపారు. హైదరాబాద్ సూపర్‌స్టార్స్ జట్టులో భాగమవడం ప్రత్యేక అనుభవమని పేర్కొన్నారు.బలమైన గ్రౌండ్ స్ట్రోక్స్, చురుకైన కోర్ట్ కవరేజ్‌తో సియోన్ ఈ సీజన్‌లో విశేష ప్రదర్శన కనబరుస్తోంది. టెన్నిస్ నేపథ్యం కారణంగా పికిల్‌బాల్‌లోకి మార్పు సులభమై, గత కొన్ని నెలల్లో అంతర్జాతీయ స్థాయిలో వేగంగా ఎదిగింది.

కేఎల్ఓ స్పోర్ట్స్ మద్దతుతో ఉన్న హైదరాబాద్ సూపర్‌స్టార్స్ ప్రస్తుతం లీడర్‌బోర్డ్‌లో నాలుగో స్థానంలో ఉంది. జట్టులో మార్సెల్లో జార్డిమ్, టాలియా సాండర్స్, కైట్లిన్ హార్ట్, పెప్ కాన్యాడెల్, లారెన్ మెర్కాడో, లూయిస్ లావిల్లే, మయూర్ పాటిల్ వంటి ఆటగాళ్లు ఉన్నారు.

# హైదరాబాద్‌లో ఇస్పకాన్ 2026 ప్రారంభం

నొప్పి నివారణలో ఆధునిక వైద్య విధానాలపై చర్చ



హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి : ఇండియన్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ పెయిన్ (ఇస్పకాన్ 2026) 40వ వార్షిక సదస్సు హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది . ఈ సదస్సులో దేశ నలుమూలల నుంచి అలాగే అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన నొప్పి నివారణ నిపుణులు, క్లినీషియన్లు, పరిశోధకులు పాల్గొన్నారు.సదస్సును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ తాజా మాజీ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలి ప్రారంభించారు. అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్, సిటిజన్ హాస్పిటల్స్ ప్రాంతీయ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ పాలచర్ల ప్రభాకర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ఐఎస్ఎస్పీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ పొద్దార్ అధ్యక్షత వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉమా మహేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ నాగలక్ష్మి పట్నాల కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించారు.పలు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో వివిధ వైద్య విభాగాల మధ్య సమన్వయం, నొప్పి నివారణలో ఇంటర్వెన్షనల్, ఫార్మకాలజికల్ ఆధునిక విధానాలు,దీర్ఘకాల నొప్పులకు బయోసైకోసోషియల్ విధానంపై విస్తృతంగా చర్చించారు. నొప్పులతో బాధపడుతున్న రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

## చేపల మార్కెట్ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలి : మాజీ కార్పొరేటర్ విజయ లక్ష్మి సుబ్బారావు



నిజాంపేట్ మేజర్ న్యూస్ : ప్రగతి నగర్ మోర్ సూపర్ మార్కెట్ నుంచి రాజీవ్ గృహ కల్పకు వెళ్లే ప్రధాన రహదారిపై, సైదప్ప బస్తీ, ప్రశాంతి హిల్స్ మధ్యలో ఉన్న గవర్నమెంట్ ఖాళీ స్థలంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేయనున్న ప్రతిపాదనను వెంటనే రద్దు చేసి, అక్కడ రైతు బజార్ ఏర్పాటు చేయాలని మాజీ కార్పొరేటర్ విజయ లక్ష్మి సుబ్బారావు అన్నారు. శుక్రవారం నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ను మాజీ కార్పొరేటర్ విజయ లక్ష్మి సుబ్బారావు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరు ప్రాంతం పూర్తిగా స్కూల్ జోన్ పరిధిలో ఉండటంతో పాటు, ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు ఈ రహదారిపై నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్లి వస్తుంటారని పేర్కొన్నారు. ఇలాంటి ప్రాంతంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు, అసౌకర్యాలు ఏర్పడి విద్యార్థులు, మహిళలు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆ ప్రాంతం వ్యర్థాల సమస్యతో బాధపడుతోందని, చేపల మార్కెట్ ఏర్పాటైతే చేపల వ్యర్థాలు అక్కడే పడేసే అవకాశం ఉండటంతో దుర్గంధం వ్యాపించి ప్రజారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. దీని ప్రభావం పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు పదివేల కుటుంబాలపై పడుతుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భద్రత, పరిసరాల పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని చేపల మార్కెట్ ప్రతిపాదనను రద్దు చేసి, గతంలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అదే స్థలంలో రైతు బజార్ ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ చంద్రమౌళి, డా. ఎం.ఆర్.ఎస్. రాజు, రచ్చ చక్రధర్, సుబ్బారావు, సత్య తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 9నుంచి ఆన్‌లైన్‌లో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీకోసం దరఖాస్తుల స్వీకరణ–జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి




సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026–2028 సంవత్సరానికిగాను జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీకోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ఛైర్ పర్సన్ హరిచందన దాసరి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అమలులోఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాల పరిమితి గడువు ఈనెల 28వ తేదితో ముగియనున్నదని, అర్హత కలిగిన జర్నలిస్టులకు 2026–2028 సంవత్సరానికిగాను కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డులకోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారికి సమర్పించాలన్నారు. యాజమాన్యాలద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ దరఖాస్తులను ఈనెల 9వ తేదినుంచి సమర్పించాలని,అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి జారీ చేసిన ఓ ప్రకటనలో తెలిపారు.

### మల్లన్న సాగర్ పంప్ హౌస్ పనులు

# వేగవంతం చేయండి







**మొదటిపేజీ తరువాయి...** శుక్రవారం ప్రాజెక్టులో భాగంగా మల్లన్న సాగర్ రిజర్వాయర్ వద్ద నిర్మించనున్న పంప్ హౌస్ ప్రారంభ పనులను పరిశీలించారు. మల్లన్న సాగర్ రిజర్వాయర్ ట్యాపింగ్ పాయింట్ కు సమీపంలో 20 టీఎంసీల సామర్థ్యం కలిగిన రా వాటర్ పంపింగ్ హౌస్ నిర్మాణానికి అనుగుణంగా చేపట్టే ప్రారంభం పనులను అధికారులతో కలిసి పరిశీలించారు.

పంపు హౌస్ కి సంబంధించిన సాంకేతిక వివరాలను తెలుసుకున్నారు. ఈ పంపింగ్ హౌస్ నుంచి ఘనపూర్ వరకు దాదాపు 50 కిలోమీటర్ల రెండు వరుసల 3000 ఎంఎం డయా పైపు లైను సంబంధించిన నిర్మాణ పనులు పరిశీలించారు. ఘనపూర్ మాస్టర్ రిజర్వాయర్ వద్ద నిర్మిస్తున్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద రా వాటర్ ను శుద్ధి చేసి నగరానికి తరలిస్తారు.

గజ్వేల్ మండలంలోని పాతూరు గ్రామ సమీపం వద్ద పైపు లైను నిర్మాణ పనులను ఎండీ పరిశీలించారు. వెల్డింగ్ పనుల నాణ్యత, మన్నిక వివరాలను కార్మికులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రతి పైపుకు యూనిక్ నెంబర్ ను కేటాయించి ప్రతి పైపుని జియో ట్యాగ్ చేయాలని.. దీనికోసం ఐటీ విభాగ అధికారుల సాయంతో ప్రత్యేక మొబైల్ యాప్ ను రూపొందించేలాగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పైపులైన్ల జాయింట్ల పటిష్టతను ప్రత్యేకమైన ఫ్లా డిటెక్టర్(అల్ట్రా సోనిక్ టెస్ట్) పరికరంతో పరీక్షించి సంతృప్తి చెందారు.

అనంతరం ఘనపూర్ వద్ద నిర్మిస్తున్న 1170 ఎమ్మెల్డీల వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనుల పురోగతిని పరిశీలించారు. టైమ్ లైన్లకు నిర్దేశించుకున్న పనులు పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు.దీనికి అవసరమైతే రెండు షిఫ్టుల్లో పనులు జరిగేలాగా చూసుకోవాలని అన్నారు. అవసరమైతే అదనపు గ్యాంగ్ లను నియమించుకోవాలని సూచించారు.ప్రాజెక్ట్ స్వరూపం: గోదావరి డ్రికింగ్ వాటర్ సప్లై పథకం ఫేజ్–1 కింద.. నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టీఎంసీల నీరు తరలిస్తోంది. తాజాగా పథకంలో రెండు దశల ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి మరో 20 టీఎంసీల నీరు వాడుకునే అవకాశం ఉంది. ఈ 20 టీఎంసీల్లో.. 17.5 టీఎంసీలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోగా, మూసీ ప్రక్షాళనలో భాగంగా.. జంట జలాశయాలను పునరుజ్జీవనం చేసేందుకు మిగిలిన 2.5 టీఎంసీలను ఉపయోగించనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రెండు లాభాలున్నాయి. ఒకటి హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చడం, రెండోది.. మూసీ ప్రక్షాళన, జంట జలాశయాల పునరుజ్జీవం చెయ్యడం.

ఈ ప్రాజెక్టులో పంప్ హౌజ్ లు, సబ్ స్టేషన్లు, మల్లన్న సాగర్ నుంచి ఘన్ పూర్ వరకు 3000 ఎంఎం డయా భారీ పైపు లైన్ నిర్మించనున్నారు. అంతే కాకుండా ఘన్ పూర్, శామీర్ పేట్ వద్ద 1170 ఎంఎల్డీల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాన్ని (డబ్ల్యూటీపీ) నిర్మించనున్నారు. ఘన్ పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణంతో పాటు.. ఇతర పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్ –2?3 ద్వారా 300 ఎంజీడీల నీరు సరఫరా చేస్తారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎమ్ మహేష్ కుమార్, ప్రాజెక్ట్ వింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వనస్థలి కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్

- ఉత్పత్తి ధరలకే నాణ్యమైన వస్త్రాలు – హ్యాండీక్రాఫ్ట్ వస్తువులు
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న మేళా అధ్యక్షులు అక్బర్ అలీ, కార్యదర్శి గంగాధర్





వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃవనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండీక్రాఫ్ట్ మేళా వినియోగదారులను ఆకట్టుకుంటుంది. నాణ్యమైన చేనేత వస్త్రాలు, హ్యాండీక్రాఫ్ట్ వస్తువులు ఉత్పత్తి ధరలకే అందుబాటులో ఉండడంతో కాలనీల వాసులు ఎగ్జిబిషన్‌ను సందర్శించి తమకు ఇష్టమైన వస్త్రాలు, వస్తువులను కొనుగోలు చేస్తు సందడి చేస్తున్నారు. ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్, భాగల్‌పూర్ శారీస్, డిజైనరీ శారీస్, కాంతావర్క్ శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారీ శారీస్, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనరీ బ్లౌజెస్, లక్నో చికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు ఉత్పత్తి ధరలకే అందుబాటులో ఉన్నాయని కాలనీల వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎగ్జిబిషన్ అధ్యక్షులు అక్బర్ అలీ, కార్యదర్శి గంగాధర్‌లు తెలిపారు.

## దోపిడి కేసును ఛేదించిన రాయదుర్గం పోలీసులు

రాయదుర్గం,మేజర్ న్యూస్ : రాయదుర్గం పోలీస్ స్టేషన్ మహాప్రస్థానం సమీపంలో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించినట్లు రాయదుర్గం డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ టి. భూపతి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తనను ఓ వ్యక్తి రాయితో గాయపరిచి తన మొబైల్ ఫోన్ లాక్కుని పారిపోయాడని మహమ్మద్ ఒవైసి అని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఈ నెల 3వ తేదీన రాత్రి 10.30 గంటల సమయంలో నిందితుడు మహమ్మద్ జావీద్, మహమ్మద్ ఒవైసీపై రాయితో దాడి చేసి గాయపరిచాడు. అనంతరం బాధితుడి యూపీఐ ఖాతా ద్వారా 400 బదిలీ చేయించుకొని, మొబైల్ ఫోన్ లాక్కుని ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు.ఈనెల 5వ తేదీన రాయదుర్గం పీఎస్ క్రైమ్ సిబ్బంది / నిందితుడిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్‌తో పాటు మరో రెండు మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించామన్నారు.

## కృష్ణ గోపాల్ సేవా సమితి వారిచే పేదలకు అల్పాహారం వితరణ

వనస్థలిపురం,మేజర్‌న్యూస్ః

కృష్ణ గోపాల్ సేవా సమితి వారి ఆధ్వర్యంలో శుక్రవారం పేద పిల్లలకు అల్పాహారం వితరణ కార్యక్రమం జరిగింది. నిత్య సేవా కార్యక్రమంలో భాగంగా నిరుపేద విధ్యార్థులకు అల్పాహారం అందజేసినట్లు సేవా సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సచిన్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీ మనోజ్‌గుప్తా, ఈసి సభ్యులు సిద్దార్ద్ పాల్చం, సతీష్, సురేష్ ధవాలే, ప్రభు, సంజయ ధన్నావత్ తదితరులు పాల్గొన్నారు.



# అవయవ దానంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలి

▶▶ అవయవ దానంపై ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ 124 ప్రజల చెంతకు చేరాలి ▶▶ అవయవ దానం అనేది మానవత్వానికి అత్యున్నత ప్రతీక

▶▶ లయన్స్ క్లబ్ సమావేశంలో శరీర అవయవ దానం తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యస్. రామచంద్రరావు



వనస్థలిపురం,మేజర్న్యూస్ఃలయన్స్క్లబ్ ఆఫ్ 320 సి వనస్థలి క్రాంతి సర్వ సభ్య సమావేశం సాధు కృష్ణ కిషోర్ అధ్యక్షతన వనస్థలిపురంలో జిగింది. ఈ సందర్బంగా కృష్ణ కిషోర్ జూలై నెల 2025 నుండి జనవరి 2026 వరకు లయన్స్క్లబ్ ద్వారా జరిగిన కార్యక్రమం వివరాలను సభ్యులకు వివరించారు. ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 2026 వరకులయన్స్క్లబ్ ద్వారా జరిగే కార్యక్రమాలు వివరించారు. సంధ్యారాణి కోశాధికారి జమ ఖర్చుల వివరాలను వ్లెలడించారు. ఈ సందర్బంగా క్లబ్ వైస్ ప్రసిడెంట్, శరీర అవయవ దానం తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యస్. రామచంద్రరావు మాట్లాడుతూ మరణించిన తర్వాత కూడా జీవించాలని, యువత రక్తదానంతో పాటు ప్రాణ దాతలుగా వర్ధిల్లాలన్నారు. మనిషి బ్రెయిన్ డెడ్ అయిన సమయంలో అవయవ దానంతో పునర్జీవించవచ్చన్నారు. మరణించిన పిదప నేత్ర దానంతో అందులకు చూపునివ్వాలని, శీరర దానంతో వైద్య విద్యార్దుల పరిశోదన సముపార్జనకు సహకారం అందించాలని వివరించారు. శరీర అవయవ దానం విషయంలో ప్రభుత్వం జి.ఓ. యం.ఎస్ 124 విడుదల చేసిందని, జి.ఓ సారాంశాలను సభ్యులకు వివరించారు. జీ.ఓ విషయాన్ని ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. శరీర అవయవదానం చేసిన కుటుంబానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని తెలిపారు. తెలంగాణ వైద్య విద్యా సంచాలకులు, జీవన్ దాన్ సంస్థలు అవయవ దాన లక్ష్య సాధన కోసం అంత్యక్రియల ఖర్చుల కోసం 10 వేల రూపాయలు, అదనపు ఖర్చుల కింద వేయి రూపాయలు, ఇతర ప్రోత్సహకాలు అందజేస్తుందని వివరించారు.

## లైసెన్స్ రెన్యూవల్ విషయంలో,,,ఆర్టీఏ సౌత జోన్ సిబ్బంది నిర్లక్ష్యం :ఉద్యోగాలు కోల్పోతున్న యువత



చార్మినార్, మేజర్ న్యూస్: లైసెన్స్ రెన్యూవల్స్ విషయంలో ఆర్టీఏ సౌత్ జోన్ సిబ్బంది చేస్తున్న తాత్సారం కారణంగా డ్రైవర్లుగా పనిచేస్తున్న వారు నిరుద్యోగులుగా మారుతున్నారని, ఇందుకు కారణమైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, రవాణశాఖ మంత్రి, ట్రాన్స్ పోర్ట్ కమిషనర్, జాయింట్ కమిషనర్ కు సిటీ ఆటో మోటర్ క్యాబ్ డైవర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ మొహమ్మద్ మక్కీ డిమాండ్ చేశారు. లైసెన్స్ రెన్యూవల్ సమయానుసారం జరగకపోవడంతో హేవీ మోటార్ ఉద్యోగం చేస్తున్న మొహమ్మద్ ఇమ్రాన్ అనే తమ యూనియన్ సభ్యుడు ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. లెసెన్స్ రెన్యూవల్ కానందున అతని ఉద్యోగం నుంచి తీసేశారని, వాస్తవానికి ఇమ్రాన్ అనే వ్యక్తి లైసెన్స్ రెన్యూవల్ కోసం గత మూడు నెలలుగా బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయం చుట్టూ తిరిగిన సమస్యపరిష్కారం కాలేదని, ఇదే విషయాన్ని బండ్లగూడ ఆర్టీఏ వద్దకు తీసుకెళ్లినా ఆయన కూడా వీటికి పరిష్కారం చూపించలేకపోయారని మొహమ్మద్ మక్కి ఆవేదన వ్యక్తంచేశారు. సిస్టమ్ లో సాంకేతిక సమస్యలున్నాయని రెన్యూవల్ సెక్షన్ లోని కౌంటర్ క్లర్క్ లు షాకులు చూపుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇదే సమస్య సౌత్ జోన్ లోని అన్ని ఆర్టీఏ కార్యాలయాలలో ఉందని వెల్లడించారు. ఈ కారణంగా చాలా మంది హేవీ డ్రైవర్లుగా పనిచేస్తున్న వారు తమ లైసెన్స్ లు రెన్యూవల్ కాకపోవడంతో ఉద్యోగాలు కోల్పోతున్నారని, సౌత్ జోన్ ఆర్టీఏ లోని కౌంటర్ క్లర్క్ లు తమ నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగులను పెంచుతున్నారని ఆయన విమర్శించారు. వీటితోపాటు ఆర్టీఏ కార్యాలయంలోని సిబ్బంది సమయ పాలన పాటించకుండా కార్యాలయానికి వస్తున్నారని, దీంతో లైసెన్స్ ఇతర పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వెల్లడించారు. ఆర్టీఏ కార్యాలయాలలో సిబ్బంది సమయ పాలనను పాటించేందుకు బయోమెట్రిక్ పద్దతిని అమలులోనికి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. హేవీ డ్రైవర్లుగా పనిచేస్తున్న వారి ఉద్యోగాలు కోల్పోయేలా లైసెన్స్ రెన్యూవల్ చేయకుండా తాత్సారం చేస్తున్న కౌంటర్ క్లర్క్ లపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం, రవాణ శాఖ మంత్రి, ట్రైన్స్ పోర్ట్ కమిషనర్, జాయింట్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని మొహమ్మద్ మక్కీ డిమాండ్ చేశారు.


## దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు





దుండిగల్ మేజర్ న్యూస్ : బీఆర్ఎస్ పార్టీ నాయకులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా నిరసిస్తూ, దాడికి పాల్పడ్డ వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకుని కావాలని దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వజ్రేష్ యాదవ్పై తక్షణమే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజమే అయినా, దాడులకు దిగడం అనేది అప్రజాస్వామికమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల భద్రతను ప్రభుత్వం కల్పించాలని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుతో పాటు మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు మల్లారెడ్డి, మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బిఆర్ఎస్లో చేరిన కొంచ శివరాజ్ ముదిరాజ్



హఫీజ్ పెట్,మేజర్ న్యూస్ : దశాబ్ద కాలంలో ప్రజల మధ్య ఉంటూ ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మియాపూర్ మక్త మహబూబ్ పెట్ కు చెందిన కొంచ శివరాజ్ ముదిరాజ్ వారి అనుచరులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో కొంచ శివరాజ్ బీఆరెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు ఖాన్ గ్రేస్ అరాచక పాలనలో విసుగెత్తి పోయారని ఎద్దేవా చేశారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడి, బిఆర్ఎస్ పార్టీకి పట్టం కడతారని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ లో చేరిన కొంచ శివరాజ్ ముదిరాజ్ ను అభినందించారు. ఈ సందర్భంగా శివరాజ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తానని, పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజా సేవకై కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ మహిళా నాయకులు రోజా, కొంచె ప్రేమ్ కుమార్, శ్రీధర్ కిరణ్ నర్సింగ్ సురేష్ రాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యలమంచిలి భాను ప్రసాద్ జన్మదిన వేడుకలు

శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన వాసు చౌదరి



వనస్థలిపురం,మేజర్న్యూస్ఃవనస్థలిపురం కమ్మ సంఘం మాజీ అధ్యక్షులు భానుప్రసాద్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకలను పురస్కరించుకొని బిజెపి సీనియర్ నాయకులు వాసు చౌదరి భాను ప్రసాద్ను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అభివృద్ధితో పాటు, సమస్యల పరిష్కారం కోసం పరతపించే భాను ప్రసాద్ రాబోయే రోజుల్లో ఉన్నత పదవులు అధిరోహించి మరిన్ని సేవలు అందించాలని ఈ సందర్బంగా వాసు చౌదరి ఆకాంక్షించారు. భానుప్రసాద్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత ముందుకు వచ్చి నాయకత్వ బాధ్యతలు స్వీకరిస్తేనే రాష్ట్రం, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. సమాజ అభ్యున్నతికి యువత చురుకైన ప్రాత పోషించాలిసన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్నగర్ కాలనీ కార్యదర్శి యువిఎన్ బాబు, బిజెపి నాయకులు రాజేష్, బొల్లా శ్రీ కాంత్, సాయి, నవీన్, కమ్మ సంఘం నాయకులు పాల్గొని భాను ప్రసాద్కు శుభాకాంక్షలు తెలిపారు.

## టీజీఓ కేంద్ర సంఘం కోశాధికారి సహదేవ్కు హైదరాబాద్ జిల్లా డైరీ బహూకరణ



హైదరాబాద్ మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ () కేంద్ర సంఘం కోశాధికారి సామల సహదేవ్ను హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు హైదరాబాద్ జిల్లా 2026 డైరీని బహూకరించారు. అనంతరం సహదేవ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లా అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి, ప్రజలకు చేరువగా వెళ్తున్న అధికారులందరికీ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిజిఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి. కృష్ణ యాదవ్, ట్రెజరర్ ఎం.వి. రమణ, పవన్ కుమార్ పాల్గొన్నారు

## ప్రాచీన కళలను కాపాడుకోవాలి



రవీంద్ర భారతి, మేజర్ న్యూస్ 6 : ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పూర్వ చీఫ్ కమీషనర్ ఆఫ్ ఇన్కమ్ టాక్స్, ఐ.ఆర్.ఎస్. (రి) డా. పి. రఘు అన్నారు. తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారుడు, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ కెవి రమణ చారి జన్మదినోత్సవం సందర్భంగా కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరికథా సప్తహంలో భాగంగా ఆర్ రేఖ (రంగారెడ్డి) భాగవతారిణిచే 'దక్షయజ్ఞం హరికథాగానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రఘు పాల్గొని నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా పాలకవర్గ సభ్యులు జి. వల్లీశ్వర్, ప్రముఖ సాహితీ వేత్త వి. హర్షవర్ధన్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రమణాచారి జన్మదినాన్ని కళాకారులకు పండగ వాతావరణంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె వి రమణ కిన్నెర రఘురాం పాల్గొన్నారు.

## ఆశించిన మేర ఈస్ట్ ఆనంద్ బాగ్ ను అభివృద్ధి చేశా : కార్పొరేటర్ ప్రేమ్ కుమార్



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: ఆశించిన దాని కన్న ఎక్కువగా అభివృద్ధి చేశా...మళ్ళీ నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు మీ ముంగిట చేరుస్తానని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ డివిజన్ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన, ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధి లోని ఉప్పరిగూ డ పార్దిబస్తీలో సుమారు 40 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలనుద్దే శించి కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ మాట్లాడు తూ, కాలనీ ప్రజల అభ్యర్థన మేర కు 40 లక్షలతో నూతనంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేసి మీకు అందుబాటు లోకి తీసుకుని వచ్చానని చెప్పారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, మురికి వాడలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయా లు కల్పన కోసం తన ఐదేళ్లు పదవీ కాలంలో శక్తి వంచన లేకుండా శ్రమించానన్నారు. ఇప్ప టి వరకూ రెండు పర్యాయాలు ఈ డివిజన్ కార్పొరేటర్ గా గెలిచి ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ ను సాధ్యమైనంత వరకు అభివృద్ధి చేశానని తెలిపారు. నిరంతరం మీతో ఉండి మీ సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పు డు వాటిని పరిష్కరించగలిగానని చెప్పారు. నేను చేసిన అభివృద్ధి పనులను గుర్తించి, మళ్ళీ నన్ను మీరందరూ ఆశీర్వదించి గెలి పిస్తే అపరిష్కృత సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానన్నారు. ఈస్ట్ ఆనంద్ బాగ్ డివి జన్ ను అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చి దిద్దటమే తన ప్రథమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో డివిజన్ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ సాధ్య మైనంత వరకూ పరిష్కరించానని, తెలంగా ణ రాష్ట్రంలో తమ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది కాబట్టి, నిరంతరం మీకు అందుబాటులో ఉంటూ, అభివృద్ధి, సంక్షేమం పథకాల ఫలా లు మీ దరికి చేర వేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగ్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు బాబు, సత్యనారాయణ, సంపత్ రా వు, ఉమేష్ సింగ్, శ్రీనివాస్, బాబుసింగ్, నయూమ్ ఖాన్, ఆనంద్, జ్ఞానేశ్వర్, దీపక్, రాజు తదితరులు పాల్గొన్నారు

## బీఆర్ఎస్ జండా ఎగరవేయడం ఖాయం : శంభీపూర్ క్రిష్ణ



దుండిగల్ మేజర్ న్యూస్ : గడ్డపోతారం మున్సిపాలిటీలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జండా ఎగరవేయడం ఖాయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు శంభీపూర్ క్రిష్ణ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పటాన్ చెరువు నియోజకవర్గం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజిపల్లి 5వ, 6వ వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు గద్దె సుష్మ గణేశ్, గండి స్వప్నలకు మద్దతుగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 6:30 గంటల నుంచి 9:30 గంటల వరకు విస్తృతంగా నిర్వహించిన ప్రచారంలో శంభీపూర్ క్రిష్ణ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గడ్డపోతారం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులకు కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇన్చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# 8న బాబా శ్యామ్ భారీ రథ్ యాత్ర

హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : బాబా శ్యామ్ కు అత్యంత ఇష్టమైన ఫాల్గుణ మాసం ,ఈ నెల 8 న వేలాదిమంది భక్తులతో శ్రీ బాబా శ్యామ్ భారీ రథ్ యాత్రను నిర్వహిస్తున్నట్లు బాబా శ్యామ్ రథశోభ యాత్ర కమిటీ చైర్మన్ ఇంద్రకరణ్ అగర్వాల్, వైస్ చైర్మన్లు రామ్‌దేవ్ అగర్వాల్, పురుషోత్తం దాస్ గోయల్ లు తెలిపారు. ఈ మేరకు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్, దేశోద్ధారక భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కమిటీ సలహాదారు చంద్రకాంత్ దకోటియా. కన్వీనర్లు అమిత్ అగర్వాల్, జీవన్ భాటి, శ్రీ శ్యామ్ మందిర్ సేవా సమితి అధ్యక్షులు చంద్రకాంత్ దకోటియా, ఉపాధ్యక్షులు కృష్ణ కుమార్ బడేగావ్‌వాలే, కార్యదర్శి ఇంద్రకరణ్ అగర్వాల్, కోశాధికారి కపిల్ అగర్వాల్ లతో కలసి వారు మాట్లాడారు. మహాభారతంలోని పాండవులలో ఒకరైన భీముని మనవడైన బర్బరీకుడికి అంకితం చేయబడినది ఖాటు శ్యామ్ జీ ఆలయంగా సూచించారు. ఈ ఆలయం ఒకటి రాజస్థాన్ రాష్ట్రం, సికర్ జిల్లాలో ఉందని, రెండోది దక్షిణ భారతదేశంలో కాచిగూడ, వీరన్న గుట్ట పై ప్రసిద్ధి చెందిందని అన్నారు. ఈ ఆలయాన్ని శ్రీ కంచి కామకోటి పీఠం, శ్రీ శ్యామ్ మందిర్ సేవా సమితి నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు., ఇక్కడ నిత్యం పూజలు, అభిషేకం, భక్తులకు శ్యామ్ జల్ (పవిత్ర జలం), ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామని, ప్రతిరోజూ ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శోభ యాత్ర,, జెండాల ఊరేగింపు ను



ఉదయం చార్మినార్, మహాదేవ్ ఆలయం నుండి ప్రారంభమై, ఆఫ్జల్ గూంజ్, గౌలిగూడ, చాదర్ ఘాట్, నింబోలి అడ్డా మీదుగా కాచిగూడ లోని వీరన్న గుట్ట శ్రీ శ్యామ్ మందిర్ కు చేరుకుంటుందని తెలిపారు. అత్యంత వైభవోపేతంగా జరిగే ఈ రథయాత్రను కనులారా వీక్షించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. యాత్ర పొడవున ప్రముఖ భజన గాయకుడు కన్నయ్య మెట్టల్ పాటలు పాడనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రథ యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు.

## ప్రచార హోరు!!



ముషీరాబాద్ మేజర్ న్యూస్ : కరీంనగర జిల్లా బద్దిపల్లి గ్రామం లో గల ప్రముఖ డెంటిస్ట్ డాక్టర్ సునీల్ మంగళం ఫాం హౌస్ లో బీజేపీ నేతలు ఈ రోజు సేద తీరారు. గత వారం నుండి ప్రచారం లో దూకుడు పెంచిన బీజేపీ 9 వ వార్డు నుండి బీజేపీ నుండి పోటీ చేస్తున్న గాయత్రి దేవి కోసం ప్రచారం చేస్తున్నారు హైద్రాబాద్ నేరేడ్ మెట్, గోల్కొండ నుండి తరలిన డాక్టర్ సునీల్ మంగళమ్ ఏర్పాటు చేసిన సమావేశం విందు లో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు గీతా మూర్తి, ధనలక్ష్మి, అంజలి దేవి, కరుణశ్రీ, సుమ, రాజి రెడ్డి, నవీన్, మల్లికార్జున, ప్రవీణ్, డాక్టర్ సునీల్ మంగళం, పద్మజా రెడ్డి, అనురాధ, దశరథ లక్ష్మి, లక్ష్మి, కరుణ,రుక్మిణి, మొదలగు వారు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా ఎన్నికల నేపథ్యంలో పోతారాము గ్రామంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

**గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డిని కలిసిన పార్టీ నాయకులు**



కూకట్ పల్లి మేజర్ న్యూస్, మూడు తించలపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో, పోతారాము గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో ఈ రోజు పోతారాము గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి ని పార్టీ నాయకులు కలిసి, గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగిరెడ్డి , ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్ , బేగంపేట్ శ్రీనివాసరెడ్డి , బేగంపేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ , కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్ , బాలానగర్ కాంగ్రెస్ అధ్యక్షులు మధు గౌడ, వరాల స్వామి , అలాగే భారత్ నగర్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు అందరూ సమిష్టిగా పనిచేస్తామని నాయకులు తెలిపారు.

పోతారాము గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందని, ఎన్నికల ప్రచారంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.

## నిరంకారి సంత్ సమాగం



ముషీరాబాద్ మేజర్ న్యూస్ :ఇందిరాపార్క్ వద్ద ఎన్టీఆర్ స్టేడియం లో ఫిబ్రవరి 7-,8( నేడు /రేపు) నిరంకారి సంత్ సమాగం ఆద్యాత్మిక సమావేషాలు నిర్వహిస్తున్నారు.దక్షిణాది రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలి వస్తున్నారు.వారం రోజులనుండి ఈ భారీ సభకు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి.సద్గురు మాతా సుదీక్షా జీ మహారాజ్ హాజరై సందేశమిస్తారు.తొలిరోజు సాయంత్రం గం.4- రాత్రి గం.8.30 మహా సభ ఉంటుంది.రెండో రోజు ఉదయం 11గం- మధ్యాహ్నం గం. 2.30వరకు మహాసభలు జరుగుతాయి.ఈమరకు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు

## ఎన్పీఆర్డి డైరీ ఆవిష్కరణ !

ముషీరాబాద్ మేజర్ న్యూస్ :వికలాంగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి శైలజ అన్నారు.ఎన్పీఆర్డి తెలంగాణ రాష్ట్ర కమిటీ ముద్రించిన 2026 డైరీని ఈ రోజు మలక్పేట్లోని డైరెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమనికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ఉపయోగించుకోవాలని అన్నారు.వికలాంగుల ఛట్టలు, జీవోలు, ప్రభుత్వ సమాచారంతో డైరీ ముద్రించడానికి చేసిన కృషి అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో



హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మన్ పి ఉమర్ ఖాన్, సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి యం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్, సహాయ కార్యదర్శి జె రాజు, జవాబ్ టీవీ ఎడిటర్ నల్గొండ శ్రీనివాస్, సంస్థ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు రాజు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి : కూన శ్రీశైలం గౌడ్



జీడిమెట్ల మేజర్ న్యూస్ : గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జిగా నియమితులైన కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 2, 5, 6, 17 మరియు 20వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు షహనాజ సమీర్, సారిక, నవ్యశ్రీ, చంద్రమౌళి, వంటేరు కొండల్ రెడ్డిలకు మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ, ఉచిత కరెంటు, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని బలపరిచి, మున్సిపాలిటీలో స్థానిక కౌన్సిలర్లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోట్లాది రూపాయల నిధులతో హస్తినాపురం డివిజన్‌లో అభివృద్ధి పనులు - కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్



కర్మన్ ఘాట్, మేజర్ న్యూస్ :హస్తినాపురం డివిజన్లో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసినట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు శుక్రవారం శ్రీ రమణ కాలనీలో జిహెచ్ఎంసి నిధులు 2.50 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో సమస్యల పరిష్కారానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మధు యాష్ కి గౌడ్ సహకారంతో కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులను ముమ్మరంగా సాగిస్తున్నట్లు తెలిపారు. ఏ కాలనీలో సమస్య ఉందని తన దృష్టికి తెచ్చిన వెంటనే అట్టి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాలనీలా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూదిని వెంకటేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాంతారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,మమత,మల్లేష్ గౌడ్,రేణుక,సతీష్ గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు వృద్ధిపై దృష్టితోనే కేంద్ర బడ్జెట్

- ప్రముఖ చాటెర్డ్ అకౌంటెంట్ వై.వి. భానునారాయణ రావు
- కేంద్ర బడ్జెట్‌ను అర్థం చేసుకోవడం ప్రతి పౌరుడి కనీస బాధ్యత
- టిఏపిటిబిఏ అధ్యక్షులు సిఏ చంద్రశేఖర్ వేముల





హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : దేశ భవిష్యత్తు వృద్ధిపై దృష్టితోనే కేంద్ర బడ్జెట్ ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టారని ప్రముఖ చాటెర్డ్ అకౌంటెంట్ వై.వి. భానునారాయణ రావు తెలిపారు. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ (టిఏపిటిబిఏ) "యూనియన్ బడ్జెట్ 2026 విశ్లేషణ" అంశంపై సికింద్రాబాద్ హోటల్ తాజ్ త్రిస్టార్‌లో స్పీకర్ మీట్ నిర్వహించింది. ఈ మీట్ కు సీఏ పంకజ్ సంచేటి అధ్యక్షత వహించగా టిఏపిటిబిఏ కార్యదర్శి సీఏ ఆశిష్ జోషి కోశాధికారి సీఏ సోమేశ్వర్ నేమాని, ఉపాధ్యక్షులు సీఏ నారాయణ రావు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు రమణ రెడ్డి, కలహస్తి శ్రీనివాస, వెంకట్ రామ్, మాజీ అధ్యక్షులు రామ్‌దేవ్ భూటాడా, హితేష్ జైన్, రితేష్ మిట్టల్, మహేష్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మురళీ మోహన్ పాలోడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.వి. భానునారాయణ రావు మాట్లాడుతూ 2047 నాటికి విక్షిత్ భారత్ కోసం ఆకాంక్షను కేంద్ర బడ్జెట్ పునరుద్ఘాటిస్తుందని, కేంద్ర బడ్జెట్ లో నియమాల పాటింపుపై కఠినమైన నిఘా ఉందన్నారు. పన్ను చట్టాల సరళీకరణ మరియు స్పష్టతను కేంద్ర బడ్జెట్ 2026-27 నొక్కి చెప్పిందన్నారు. భారతీయ పన్ను వివాద చట్రంపై ఒత్తిడిని తగ్గించేందుకు పెరిగిన వ్యాజ్యాల పెండింగ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని, క్లెయిమ్‌లను వాదించడానికి అవసరమైన పన్ను డిపాజిట్ మొత్తాన్ని తగ్గించడం, అసెస్‌మెంట్ మరియు పెనాల్టీ ప్రొసీడింగ్‌లను ఏకీకృతం చేయడం, పన్ను చెల్లింపుదారులు తిరిగి మూల్యాంకన దశలో నవీకరించబడిన రిటర్న్‌లను దాఖలు చేయడానికి అనుమతించడం ఈ బడ్జెట్ ముఖ్యమైనవని తెలిపారు. చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ యూనియన్ బడ్జెట్‌ను అర్థం చేసుకోవడం ప్రతి పౌరుడి కనీస బాధ్యత అని, అది దేశ ఆర్థిక దిశను చూపడమే కాకుండా ప్రభుత్వ ప్రాధాన్యతలను కూడా ప్రతిబింబిస్తుందని అన్నారు. అలాగే, యూనియన్ బడ్జెట్ సరైన విధంగా అమలు చేయడంపై సామాన్య పౌరుల భవితవ్యం ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సీఏ సతీష్ సరాఫ్ జీఎస్టీ ప్రతిపాదనలపై విశదంగా వివరించారు.

## యువత మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలి : కె.యం. ప్రతాప్



జీడిమెట్ల మేజర్ న్యూస్ : యువత ప్రైవేట్ రంగాల్లో అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ, మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని కె.యం. ప్రతాప్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీ, సుచిత్ర రోడ్డులో ఏర్పాటు చేసిన శ్రీ శివ సాయి ఎంటర్ప్రైజెస్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ షాప్‌ను రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం. ప్రతాప్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. చిన్న, మధ్య తరహా వ్యాపారాలు యువతకు భవిష్యత్తులో స్థిరమైన ఆదాయ వనరులుగా మారతాయని తెలిపారు.

అదేవిధంగా శ్రీ శివ సాయి ఎంటర్ప్రైజెస్ ప్రోప్రైటర్ అవధూత గౌరవును ప్రతాప్ అభినందిస్తూ, ఆయన చేపట్టిన ఈ వ్యాపారం మంచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అవధూత గోపాల్, ఎరువ శంకరయ్య, పెద్ది మల్లేశం, మన్నె సత్తయ్య, ఈసీఐఎల్ నరసింహ, గుమ్మడి మధుసూదన్ రాజు, నరేందర్ రెడ్డి, బాసుపల్లి బాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



## ఘనంగా శ్రీ లక్ష్మి గణపతి దేవస్థానం వార్షికోత్సవ వేడుకలు



నిజాంపేట్ మేజర్ న్యూస్ : నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో కొలువుదీరిన శ్రీ శ్రీశ్రీ లక్ష్మి గణపతి దేవస్థానంలో వార్షికోత్సవం, శ్రీ సంకటహర చతుర్థి సందర్భంగా దేవస్థానం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రాకేష్ పంతులు దేవస్థానం కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అభిషేకాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేష అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ లక్ష్మి గణపతి స్వామివారిని దర్శించుకునేందుకు వందలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టగా, అన్నప్రసాద దాతలుగా శివకోటి ఉదయభాస్కర్, చాందిని దంపతులు, బంటి, దామెర జగదీశ్వర్ గుప్తా తదితరులు తమ వంతు సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ బాగుండాలి అందులో మేముండాలనే సంకల్పంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హెర్బల్ లైఫ్ వెల్నెస్ సెంటర్ కోచ్ లావణ్య, భాస్కర్ దంపతులు, వారి కుటుంబ సభ్యులను దేవస్థానం కమిటీ సభ్యులు సత్కరించి స్వామివారి ఆశీర్వాదం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మి గణపతి దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు గోవిందరావు, ముక్క దేవేందర్ గుప్తా, దామెర జగదీశ్వర్ గుప్తా, భవ్య టీవీ కె.వి.వి. సత్యనారాయణ, కృష్ణ, మల్లికార్జున్, రమేష్, వెంకట్రావు తదితరులు పాల్గొని స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సోనాలికా 'గోల్డ్ సిరీస్' ఆవిష్కరణతో రైతుల 30 ఏళ్ల నమ్మకానికి పండుగ




ఖైరతాబాద్ మేజర్ న్యూస్ : మూడు దశాబ్దాలుగా రైతుల అండగా నిలిచిన సోనాలికా, ఈ గోల్డ్ సిరీస్ ద్వారా కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. ఈ శ్రేణిలో గోల్డ్ డీఐ 745 మూడు మరియు గోల్డ్ డీఐ 55 మూడు అనే రెండు ప్రధాన మోడళ్లను పరిచయం చేసింది. అత్యాధునిక ఇంజినీరింగ్ సామర్థ్యాలతో రూపొందించిన ఈ ట్రాక్టర్లు ప్రస్తుత అవసరాలకే కాకుండా భవిష్యత్ వ్యవసాయ విస్తరణకు కూడా దోహదపడతాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. గోల్డ్ డీఐ 745 మూడు ట్రాక్టర్‌లో శక్తివంతమైన మూడు సిలిండర్ల అధిక సామర్థ్య ఇంజిన్ అమర్చారు. ఇది గరిష్ట శక్తి ఉత్పత్తి సామర్థ్యంతో భారీ పనులను సులభంగా నిర్వహించగలదు. పదహారు ముందడుగులు, నాలుగు వెనుకడుగులతో కూడిన బహుళ వేగ ప్రసార వ్యవస్థ, రెండు వేల కిలోల ఎత్తుగడ సామర్థ్యం కలిగిన బలమైన హైడ్రాలిక్ వ్యవస్థను కలిగి ఉంది. అలాగే గోల్డ్ డీఐ 55 మూడు మోడల్‌లో మరింత అధిక టార్క్ శక్తి, ఇరవై రెండు వందల కిలోల ఎత్తుగడ సామర్థ్యం, ద్వంద్వ క్లచ్ సౌకర్యం వంటి లక్షణాలు ఉన్నాయి. సుదీర్ఘ పని గంటల్లోనూ స్థిరమైన పనితీరును అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ సంయుక్త వ్యవస్థాపక నిర్వహణాధికారి రామన్ మిట్టల్ మాట్లాడుతూ, భారతీయ రైతు విశ్వసనీయతకు ప్రతీకగా బంగారం నిలిచినట్లే గోల్డ్ సిరీస్ కూడా దీర్ఘకాలిక పెట్టుబడిగా నిలుస్తుందని పేర్కొన్నారు. 1996లో స్థాపించబడిన సోనాలికా ట్రాక్టర్స్, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు ట్రాక్టర్లను ఎగుమతి చేస్తూ భారతీయ వ్యవసాయ శక్తిని ప్రపంచానికి చాటుతోంది. రైతు కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూపొందించిన గోల్డ్ సిరీస్, రాబోయే దశాబ్దాల పాటు విజయపథంలో ముందుకు నడిపించే శక్తిని అందిస్తుందని సంస్థ స్పష్టం చేసింది.

# 12న మోటారు రంగ కార్మికుల రాష్ట్ర బంద్

**తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, టాక్సీ, లారీ డ్రైవర్ల జేఏసీ ప్రకటన**



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో, క్యాబ్, టాక్సీ, లారీ డ్రైవర్లలకు ఇచ్చిన హామీల అమలుకై , రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా రవాణారంగా కార్మికులు ఈనెల 12న రాష్ట్ర వ్యాప్త బంద్ పాటిస్తున్నామని ఆటో, క్యాబ్ ,టాక్సీ, లారీ డ్రైవర్ల జేఏసీ నేతలు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్, దేశోద్ధారక భవనం లో జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, టాక్సీ, లారీ డ్రైవర్ల జేఏసీ కన్వీనర్ బి. వెంకటేశం (ఏఐటీయూసీ), కో కన్వీనర్ లు వి. మారయ్య (బి.ఆర్.టి.యు), రామకృష్ణ రెడ్డి (ఐ.ఎన్.టి.యు.సి), వి. ప్రవీణ్ (టి.యు.సి.ఐ), యాదగిరి (టి.ఎన్.టి.యు.సి), సత్తి రెడ్డి (టి.ఏ.డి.ఎస్), అమానుల్లా ఖాన్, షేక్ మజీద్ (ఐ.ఎల్.డబ్ల్యూ.ఎఫ్), శ్రీనివాస్ (జి.యు.టి.ఎస్), ఎస్. దయానంద్ (టి.టి.డబ్ల్యూ.యు), శివ ఆనంద్ (టి.ఏ.ఎం.డి.యు) మాట్లాడారు. ఈ సందర్బంగా బంద్ గోడ పత్రిక ను ఆవిష్కరించి బి. వెంకటేశం మాట్లాడుతూ.. నూతన మోటార్ వాహన చట్టం మరియు నాలుగు లేబర్ కోడ్ లు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం రవాణారంగా కార్మికుల నడ్డి విరిచాడాన్ని నిరసిస్తూ, రాష్ట్రంలో ఎన్నికల మానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికులకు ఆటో మీటర్ చార్జీలు పెంచుతానని, ఆటో రవాణారంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ను ఏర్పాటు, ప్రతి ఆటో డ్రైవర్ కు సంవత్సరానికి రూ.12 వేలు ఆర్థిక సహాయం వంటి హామీలిచ్చి అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త బంద్ పాటిస్తున్నామని తెలిపారు. ఈ బంద్ లో రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్లు, రవాణారంగా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. వి. మారయ్య మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ లో అక్రమంగా నడుస్తున్న ఇతర జిల్లాల ఆటోలు,ఓలా, రాపిడో, ఉబర్ ద్వారా అక్రమంగా నడుస్తున్న త్వో వీల్లర్ లను వెంటనే నిషేదించాలని డిమాండ్ చేసారు. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మోటార్ వాహన చట్టం 2019 ను మరియు ఆటో డ్రైవింగ్ లైసెన్సు సారథి వాహన పోర్ట్ నువెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేసారు. వి. ప్రవీణ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల మధ్య కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ ను అమలు చేయాలనీ కోరారు. యాదగిరి మాట్లాడుతూ హెవీ డ్రైవింగ్ స్కూల్ లను పథ ఉమ్మడి జిల్లాలలో ఏర్పాటు చేయాలన్నారు. సత్తి రెడ్డి మాట్లాడుతూ 15 సంవత్సరాలు దాటినా వాహనాలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన ఫిట్నెస్ రెన్యువల్ చార్జీలను తగ్గించాలని అన్నారు. అమానుల్లా ఖాన్ మాట్లాడుతూ ఆటో, క్యాబ్ లకు ఈ చలాన్ ల నుండి మినహాయింపు ఇచ్చని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఆటో డ్రైవర్స్ యూనియన్ నేతలు ఎస్. అశోక్, సిహెచ్. జంగయ్య, నరసింహ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయం ఏర్పాటు చేసే అభ్యర్ధికే ఓటు వేయాలి : అనుముల శ్రీనివాస్



ముషీరాబాద్ మేజర్ న్యూస్ :తెలంగాణ వ్యాప్తంగా అన్నీ మున్సిపల్, కార్పొరేషన్ లలో ఫిబ్రవరి 11 న జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ వార్డుల్లో ప్రచారానికి వెళ్ళినప్పుడు ఓటర్లకు మద్యం సీసాలు,డబ్బులు మరియు బహుమతులతో ప్రలోభ పెట్టకుండా తమ అభివృద్ధి కార్యక్రమాల్లో గ్రంథాలయాల ఏర్పాటు కూడా ఒక అంశంగా తమ మేనిఫెస్టోలో ఏర్పాటు చేయాలని, తమ వార్డుల్లో జ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తామని ఓటర్లకు హామీ ఇవ్వాలని విపంచి ఫౌండేషన్ అధ్యక్షులు కీర్తి పురస్కార గ్రహీత అనుముల శ్రీనివాస్ కోరారు. అదేవిధంగా గెలిచిన అభ్యర్థులు తమ వార్డుల్లో ఉన్న కమ్యూనిటీ హాల్ లేదా పార్కుల్లో ఒక గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నారు..ఓటర్ల ఆరోగ్యం పాడు చేసే ప్రలోభాలకు లోనూ చేయకుండా జ్ఞాన తెలంగాణ నిర్మించడంలో పాలుపంచుకోవాలి. అదేవిదంగా ఓటర్లు కూడా తాము చెల్లిస్తున్న ఆస్తి పన్ను లో గ్రంథాలయ సెస్సు కూడా ఉంటుంది కాబట్టి వారి వద్దకు ఓటు అడగాడానికి అభ్యర్డులు వచ్చినప్పుడు తమ వార్డుల్లో గ్రంథాలయ ఏర్పాటు చేయమని అడగాలని సూచించారు. గ్రంథాలయ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన వారికే ఓటు వేయాలని ఫౌండేషన్ అధ్యక్షులు అనుముల శ్రీనివాస్ ఓ ప్రకటనలో కోరారు.

# గీతం స్కాలర్ జి. రాంబాబుకు పీహెచ్‌డీ



హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి: ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాద్ గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థి గుగులోతు రాంబాబుకు గీతం విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసింది. 'సంభావ్య క్యాన్సర్ నిరోధక, సూక్ష్మజీవుల నిరోధక కారకాలుగా అజాహెటె రోసైకిల్ కలిగిన ఫార్మకోఫోర్ల రూపకల్పన, సంశ్లేషణ' అంశంపై ఆయన పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శివకుమార్ మార్గదర్శనం వహించారు. ఈ అధ్యయనం ట్యూబులిన్‌పై కోల్చిసిన్-బైండింగ్ సైట్‌ను నిరోధించే నూతన మైక్రోట్యూబ్యూల్-టార్గెటింగ్ ఏజెంట్ల రూపకల్పన, సంశ్లేషణపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న క్యాన్సర్ వ్యతిరేక చికిత్స లలో కనిపించే ఔషధ నిరోధకత, విషపూరిత ప్రభావాలను అధిగమించేందుకు ఇది ఆశాజనకమైన వ్యూహంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సహజ ఫార్మకోఫోర్ల ప్రేరణతో రూపొందించిన వినూత్న పైరోలిడినిల్ బైంజైలమైన్ ఉత్పన్నాల అభివృద్ధి, జీవసంబంధ మూల్యాంకనం ఈ పరిశోధనలో భాగమని, ఇవి క్యాన్సర్ వ్యతిరేక సామర్థ్యంతో పాటు ఔషధ పనితీరును మెరుగుపరచే అవకాశాలు కలిగి ఉన్నాయని తెలిపారు. క్యాన్సర్ చికిత్సకు కొత్త సీస అణువుల ఆవిష్కరణకు ఈ పరిశోధన దోహదపడుతుందని విశ్లేషించారు. డాక్టర్ రాంబాబు సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించిన సందర్భంగా గీతం విశ్వవిద్యాలయం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

# ఆరోగ్యమే అసలైన సంపద - ఆధునిక వైద్యంతో ఆరోగ్యం పదిలం

**భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

కర్మన్ ఘాట్, మేజర్ న్యూస్ :ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని బాలాజీ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వెల్కనాక్స్ మెడికల్ రియాబిటేషన్ ను భారత మాజీ ఉపరాష్ట్రపతి, పద్మ విభూషణ్ గ్రహీత యం.వెంకయ్య నాయుడు, ఆంధ్రప్రదేశ్ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి లు ముఖ్య అతిథిలుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..విద్యా మరియు వైద్య రంగాలు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా మారాలని, పేదలకూ ధనికులకూ తేడా లేకుండా ఉచితంగా అందుబాటులో ఉండాలన్నారు.



అలాగే యువత కాలానికి తగ్గట్టు కమ్యూనికేషన్ స్కిల్స్ ను అభ్యసించి, సమాజంలో నాయకత్వ పాత్ర పోషించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, నాణ్యమైన పునరావాస వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన వెల్నాక్స్ మెడికల్ రెహాబిలిటేషన్ సెంటర్ ను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ, ప్రజారోగ్యానికి ఇది కీలక మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కేంద్ర యాజమాన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, మరిన్ని సేవా కార్యక్రమాలతో సమాజానికి మేలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యజమాన్యం డా.స్వాతి ప్రత్తిపాటి, డా.సిద్ధార్థ్ సాయి మరియు కామినేని ఎండి శశిధర్, ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రాంత సంఘచాలక్ సుందర్ రెడ్డి , బిజెపి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి , కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి ,స్తానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 35 ఏళ్ల వెన్నునొప్పికి ముగింపు

**మెడికవర్ హాస్పిటల్స్‌లో అరుదైన శస్త్రచికిత్సతో మహిళకు కొత్త జీవితం**




హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి: గత 35 సంవత్సరాలుగా తీవ్రమైన వెన్నునొప్పి, వెన్ను భాగం నుంచి నిరంతరంగా చీము రావడం వంటి సమస్యలతో బాధపడుతున్న 43 ఏళ్ల మహిళకు మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు విజయవంతమైన అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి కొత్త జీవితం అందించారు.

సుమారు 30 సంవత్సరాల క్రితం విదేశాల్లో వెన్ను కింది భాగంలో వాపు సమస్యకు సంబంధించి శస్త్రచికిత్సలు చేయించుకున్న ఈ మహిళకు ఆ తర్వాత కూడా నొప్పి తగ్గలేదు. ఏళ్ల తరబడి బాధ కొనసాగడంతో సాధారణ జీవితం గడపలేని స్థితికి చేరుకున్నారు. పాత వైద్య పత్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల చికిత్స మరింత సవాలుగా మారింది. మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ సర్జన్ డా. వెంకట పవన్ కుమార్ నేతృత్వంలోని వైద్య బృందం నిర్వహించిన స్కానింగ్ పరీక్షల్లో, వెన్నుపూస కింది భాగంలో సుమారు 15 × 20 సెం.మీ. పరిమాణంలో భారీ గడ్డ ఉన్నట్లు గుర్తించారు. అది వెన్నెముకకు, మలద్వారానికి అత్యంత దగ్గరగా ఉండటంతో శస్త్రచికిత్స అత్యంత క్లిష్టంగా మారిందని వైద్యులు తెలిపారు. ఈ హై-రిస్క్ ఆపరేషన్‌ను న్యూరో సర్జన్, ట్రామా సర్జన్, ప్లాస్టిక్ సర్జన్, అనస్థీషియా నిపుణులు కలిసి బహుళ విభాగాల బృందంగా సుమారు ఆరు గంటల పాటు నిర్వహించారు. ఎలాంటి నరాలకు హాని కలగకుండా గడ్డను పూర్తిగా తొలగించి, అనంతరం ప్లాస్టిక్ సర్జరీ ద్వారా ఆ భాగాన్ని పునర్నిర్మించారు. శస్త్రచికిత్స అనంతరం మహిళ వేగంగా కోలుకుని, ప్రస్తుతం నొప్పి, చీము సమస్యల నుంచి పూర్తిగా విముక్తి పొందారని వైద్యులు తెలిపారు. ఆమె సాధారణ జీవితం గడుపుతూ రోజువారీ పనులు నిర్వహిస్తున్నారు.డా. వెంకట పవన్ కుమార్ మాట్లాడుతూ, "35 ఏళ్లుగా సమస్య కొనసాగడం, పాత చికిత్స వివరాలు లేకపోవడం వల్ల ఈ కేసు అత్యంత సవాలుగా మారింది. అయినప్పటికీ ఆధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందం సమన్వయంతో శస్త్రచికిత్సను సురక్షితంగా పూర్తి చేయగలిగాం" అన్నారు. వైద్యులు దీర్ఘకాలంగా వెన్నునొప్పి, వాపు లేదా చీము సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నిపుణులను సంప్రదించాలని సూచించారు

# కూకట్‌పల్లి మండల ట్రస్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల కారస్పాండెంట్లకు అవగాహన సదస్సు




కూకట్ పల్లి మేజర్ న్యూస్ : కూకట్‌పల్లి మండల ట్రస్మా ఆధ్వర్యంలో కెపిహెచ్‌బీ కాలనీలోని ఇగ్నైట్ కళాశాలలో శనివారం ప్రైవేట్ పాఠశాలల కారస్పాండెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ట్రస్మా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, ఏపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ రావు, ఏపీఎస్ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యుడు రాము, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు హరిబాబు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యారంగానికి సంబంధించిన ప్రభుత్వ జీవోలను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పూర్తిగా అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘటితంగా చర్చించి, పరిష్కార మార్గాలు అన్వేషిద్దామని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ట్రస్మా, ఏపీఎస్ సంస్థలు ఎల్లప్పుడూ సహకరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా కూకట్‌పల్లి మండల అధ్యక్షుడు జే. కమలాకర్ రావు, కే. రవి బాబు, ఎం. సుబ్రహ్మణ్యం, వి. రామకృష్ణ రావు, డి. శ్రీనివాసులు, కూకట్‌పల్లి మండల ట్రస్మా సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి : బీజేపీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్





నిజాంపేట్ మేజర్ న్యూస్ : జీహెచ్ఎంసి నిజాంపేట సర్కిల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నిజాంపేట అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం డిప్యూటీ కమిషనర్ సబీర్ అలీ, టౌన్ ప్లానింగ్ ఏసిపి ప్రసీదను బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ నిజాంపేట సర్కిల్‌లోని పలు కాలనీల్లో దోమల సమస్య తీవ్రంగా ఉందని, దోమకాట్ల కారణంగా ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫాగింగ్ పనులు తూతూ మంత్రంగా జరుగుతున్నాయని, ప్రతి రెండు రోజులకు ఒకసారి ఫాగింగ్ చేపట్టి చెత్తను రోజువారీగా తొలగించాలని సూచించారు. చెత్త సేకరణ పేరుతో ప్రతి ఫ్లాట్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారని తెలిపారు.

నిజాంపేట సర్కిల్‌లో చెత్త సేకరణకు ప్రామాణిక విధానం, ఏకరీతి రేట్లు అమలు చేయాలని, అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నంబర్లు 87, 88, 89లలోని సుమారు 3.5 ఎకరాల ప్రభుత్వ భూమిలో గతంలో ప్రకటించినట్లుగా మోడల్ రైతు బజార్ ఏర్పాటు చేయాలని కోరారు. తర్క చెరువు అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు పాపయ్యకుంట పరిరక్షణ, సుందరీకరణ పనులు చేపట్టి కంచె, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ సంతలు, తై బజార్లలో అనధికార వసూళ్లపై చర్యలు తీసుకోవాలని, అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను నిజాంపేట సర్కిల్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సర్వే నంబర్ 233కు సంబంధించిన ప్రభుత్వ భూమిని అక్రమ ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుని మినీ స్టేడియం, వంద పడకల ఆసుపత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల వంటి ప్రజాప్రయోజన పనులకు వినియోగించాలని సూచించారు. వీధి వ్యాపారుల విషయంలో సరైన నియమ నిబంధనలు అమలు చేసి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నిజాంపేట ప్రధాన కార్యదర్శి సచిన్, రాష్ట్ర మహిళా నాయకురాలు శిల్పారెడ్డి, పార్లమెంట్ మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావు, కౌశిక్ నాయుడు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వెంకటేష్ ముదిరాజ్, వైస్ ప్రెసిడెంట్ సిద్ధు, బీజేవైఎం అధ్యక్షుడు ఎన్.ఆర్.కే. ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్‌ను సందర్శించి ఈ-ఆఫీస్ అప్లికేషన్‌ను ప్రారంభించిన హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి. ఆనంద్



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్‌ః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు విభాధిపతుల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం లక్డికాపూల్‌లోని ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్‌ను రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి. ఆనంద్ సందర్శించి, అక్కడ ప్రత్యేకంగా డైరెక్టరేట్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన "ఈ- ఆఫీస్" అప్లికేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సి.వి. ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా రాష్ట్రంలో కాగిత రహిత (పేపర్‌లెస్) పాలనను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ -ఆఫీస్ విధానంద్వారా ఫైళ్ళ సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని,పరిపాలనలో జవాబుదారితనం పెరుగుతుందని, ప్రాసిక్యూషన విభాగంలో ఈ విధానాన్ని విజయవంతంగా అమలుచేసిన డైరెక్టర్‌ను,సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన ప్రాసిక్యూషన్ విభాగంకోసం రూపొందించిన "ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నిర్వహణ వ్యవస్థ"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ డిజిటల్ విధానంవల్ల సిబ్బంది హాజరులో క్రమశిక్షణ,పారదర్శకత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో సి.వి. ఆనంద్ పాల్గొని,పలు కీలక సూచనలు చేశారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాజిక్యూషన్ ఎస్. సాంబశివరెడ్డి విభాగం పనితీరు,సాధించిన విజయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా వివరించారు.

## యు.పి.ఎస్.సి. పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించిన డి.ఆర్.ఓ. వెంకటాచారి





సిటీబ్యూరో,మేజర్‌న్యూస్‌ః జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. వెంకటచారి,యుపిఎస్‌సి ఇన్‌స్పెక్టింగ్ అధికారి విజయ్‌కుమార్‌లుకల్సి పరీక్షల నిర్వహణ ప్రకియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2026ను ఫిబ్రవరి,8వ తేదిన ఆదివారం హైదరాబాద్ కేంద్ర పరిధిలో ఉదయం 9.30 గంటలనుంచి 11.30 గంటలవరకు ,మధ్యాహ్నం 2.00 గంటలనుంచి సాయంత్రం 5.00 గంటలవరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షకు 15 ఉప కేంద్రాల్లో 6,000 మందికిపైగా అభ్యర్థులు హాజరవుతున్నట్లు, అదే రోజు యుపిఎస్‌సి కంబైన్డ్ జియో -సైంటిస్ట్ ప్రిలిమినరీ పరీక్ష-2026ను రెండు ఉప కేంద్రాల్లో ఉదయం9.30 గంటలనుంచి 11.30 గంటలవరకు, మధ్యాహ్నం 2.00 గంటలనుంచి సాయంత్రం 4.00 గంటలవరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు,సుమారు 600 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షలు సజావుగా,పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఏ.సి.పి. యాకుబ్‌రెడ్డి,లోకల్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్‌వైజర్లు, పోలీస్, బల్దియా, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్,వాటర్ బోర్డు,టిజిఎస్‌ఆర్టీసి,భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్,పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వినాయకనగర్‌లో పీహెచ్‌సీ భవనానికి స్థలం కేటాయించాలి : కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : వినాయక్ నగర్ డివిజన్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వ భూమిని కేటాయించాలని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆమె, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం సమ ర్పిం చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, గతం లో కేటాయించిన భూమిలో 30 అడుగుల లోతు వరకు గట్టి మట్టి లేదని, దీంతో ఇక్కడ భవన నిర్మాణం చేపట్టలేక పోతున్నామని ఆమె తెలిపారు. అలాగే, మల్కాజిగిరిలోని పాత కోర్టు ప్రాంగణాన్ని చిల్డ్రన్స్ పార్క్(పిల్ల ల ఆటస్థలం)గా అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె,ఎంపీ ఈటల రాజేందర్ ను కోరారు.

## శాతావాహన నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మహిళా సదన్ ప్రారంభం



వనస్థలిపురం,మేజర్‌న్యూస్‌ఃబిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శాతవాహననగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు మహిళా సదన్ ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధలుగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పోరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి లు హాజరై మహిళా సదన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి మాట్లాడుతూ కాలనీలో మౌళిక సదుపాయాలైన రోడ్లు, వీధి దీపాలు, మురగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటుచేశామని, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని ముందుకు సాగుతానని, కాలనీల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా మనమందరం కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కప్రాయి చెరువు సుందరీకరణను త్వరలోనే చేపడతానని ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సదన్ ప్రారంభోత్సవం సందర్భంగా కాలనీ అధ్యక్షులు నందిరాజు లక్ష్మినారాయణ, కోశాధికారి చిరంజీవులు, ప్రధాన క్యాదర్శి నాగేశ్వర్‌రావులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పోరేటర్ మొద్దు లచ్చిరెడ్డి,అరవింద్‌రెడ్డిలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నందిరాజు లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షులు దత్తాత్రేయశర్మ, ప్రకాష్‌రావు, కోశాధికారి చిరంజీవులు, కార్యదర్శి నాగేశ్వర్‌రావు, కాలనీ మహిళలు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు జాజుల బహిరంగలేఖ

**▶▶ బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకికి గులాబీ పార్టీ అండ ▶▶ బీసీల త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ టిఆర్ఎస్ బీసీ వ్యతిరేకులకు అండగా ఉండడం దురదృష్టకరం ▶▶ బీసీ ద్రోహులను చేరదీస్తూ టిఆర్ఎస్ పార్టీ చరిత్రలో బీసీ ద్రోహులపాటిగా నిలిచిపోతుంది ▶▶ బీసీల విషయంలో బిఆర్ఎస్ ముసుకు తొలగింది, బీసీ ద్రోహి మాధవరెడ్డికి ఇంధనం సమకూర్చింది ▶▶ 48 గంటల్లోగా బీసీ వ్యతిరేకులను సస్పెండ్ చేయాలి రాష్ట్రవ్యాప్తంగా టిఆర్ఎస్ కార్యాలయలను ముట్టడిస్తాం**

**▶▶ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ లేఖ**

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బీసీ రిజర్వేషన్లు పెంచకుండా బీసీలను నోట్లో మట్టి కొట్టిన బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకి గుట్టెంగారి మాధవరెడ్డి కి గులాబీ కండువా కప్పి ప్రస్తుతం జరిగే మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ తరఫున బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకి గులాబీ పార్టీ అండగా ఉంటుందని బీసీ సమాజానికి సంకేతం ఇచ్చిన కెసిఆర్ చారిత్రక తప్పు చేసిందని బిసి జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు ఈ మేరకు నేడు టిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జాజుల లేఖ రాశారు, ఈ మేరకు ఈ లేఖను మీడియాకు విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 60 శాతం పైగా ఉన్న కోట్లాదిమంది బీసీలు తమకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు కావాలని దశాబ్దాలుగా పోరాడుతున్న విషయం మీకు తెలియనిది కాదన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో తాము అధికారంలోకి వస్తే బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42% రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చేసిన నిరంతర ఒత్తిడి ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులదరణ జరిపి, బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయంలో 42 శాతం రిజర్వేషన్లు పెంచదు అసెంబ్లీలో బిల్లు పెట్టి చట్టం చేసిన విషయం మీకు విధితమే బిల్లు పెట్టే సమయంలో చట్టం చేసే సమయంలో టిఆర్ఎస్ పార్టీ మద్దతు పలికినందుకు మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. 42% బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ జీవో నెంబర్ 9 విడుదల చేసిందన్నారు. ఈ జీవోను సవాల్ చేస్తూ బీసీల రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ రెడ్డి జాగృతి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డి గారు కోర్టులో కేసులు వేసి పెంచిన రిజర్వేషన్లు కోర్టుల ద్వారా కొట్టి వేయించడం జరిగిందన్నారు. బీసీల నోటి కార్డు ముద్దను గుంజేసి బీసీలు తినే కంచంలో మన్ను పోసిన ఘనుడు మాధవరెడ్డి బీసీ రిజర్వేషన్లు తగ్గించడం మూలంగా బీసీలు వేలాది సర్పంచ్ స్థానాలను కౌన్సిలర్ కార్పొరేటర్ మున్సిపల్ చైర్మన్ ఎంపీటీసీ, జెడ్పీటీసీ కోల్పోయే అవకాశం ఏర్పడింది, బీసీలను తడి గుడ్డతో గొంతు కోసి బీసీలను రాజకీయంగా అణిచేయాలని కుట్రతో 60 శాతం జనాభా ఆకాంక్షలను ఆశలను ఆశయాలను తుంగలోకి తొక్కిన బీసీల ద్రోహి అయినటువంటి మాధవరెడ్డి గారిని ప్రస్తుతం జరిగాయి మున్సిపల్ ఎన్నికలలో ముడిచింతలపల్లి మున్సిపాలిటీ నుండి కేశవాపూర్ పదో వార్డు కౌన్సిలర్ గా టిఆర్ఎస్ పార్టీ నుండి బీఫామ్ ఇచ్చి ఎన్నికల బరిలో మీరు నిలపడం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకైనా మాధవ రెడ్డికి గులాబీ కండువా కప్పి బీసీల మనోభావాలను బీసీల ఆత్మ గౌరవాన్ని బీసీల రాజకీయ ఆకాంక్షలను టిఆర్ఎస్ పార్టీ ఏమాత్రం పట్టించుకోలేదని వారికి టీఆర్ఎస్ టికెట్ ఇవ్వడం ద్వారా స్పష్టంగా సందేశం ఇచ్చిందన్నారు. రాజకీయాలలో సుదీర్ఘమైనటువంటి అనుభవం ఉన్నటువంటి మీరు పది సంవత్సరాలు ముఖ్యమంత్రి పదవిని అలంకరించిన మీరు బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకైనా మాధవరెడ్డిని మీకు తెలవకుండా మీ పార్టీలో చేర్చుకోరని మేము బలంగా నమ్ముతున్నాం టిఆర్ఎస్ పార్టీ బీసీల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన విషయం మీకు బాగా తెలుసు మీరు టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించడానికి ముందు బిసి బిడ్డ అయిన ప్రొఫెసర్ జయశంకర్ ఆశీర్వాదంతో, టైగర్ నరేంద్ర అండ దండలతో, కొండ లక్ష్మణ్ బాబూజీ ఇచ్చిన ఆశ్రయంతో,కాసోజు శ్రీకాంత్ చారి నుండి కానిస్టేబుల్ కిష్టయ్య త్యాగాలతో మీ పార్టీ నిలబడిందని విషయం మీకు తెలియనిది కాదు, బిఆర్ఎస్ పార్టీ బీసీల వైపు న్యాయం ఉందని భావిస్తే మీరు చేసిన ఈ బీసీ విద్రోపు చర్యను తక్షణమే ఉపసంహరించుకొని బీసీ సమాజానికి క్షమాపణ కోరి బీసీల పక్షాన నిలబడాలని మిమ్ములను కోరుతున్న. మీ నిర్ణయం 48 గంటలు వెల్లడిస్తారని ఆశిస్తున్నాం లేని పక్షంలో తెలంగాణ రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బీసీల పక్షాన ప్రజాస్వామ్యుతంగా మీ బీసీ వ్యతిరేక వైఖరి నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పూలుకొని మీ బీసీ వ్యతిరేక వైఖరి రాష్ట్రంలోని గ్రామ గ్రామాన ఎండగడతామని జాజుల శ్రీనివాస్ గౌడ్ లేఖ లో పేర్కొన్నారు.



## యెస్ బ్యాంక్కు మూడో త్రైమాసికంలో దృఢమైన ఫలితాలు

ఖైరతాబాద్ మేజర్ న్యూస్ : ప్రైవేటు రంగానికి చెందిన ప్రముఖ బ్యాంకు యెస్ బ్యాంక్ 2025 డిసెంబర్ 31తో ముగిసిన మూడో త్రైమాసికానికి బలమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. పన్ను తరువాత లాభం గత ఏడాదితో పోలిస్తే 55.4 శాతం పెరిగి రూ. 952 కోట్లకు చేరుకుంది. కార్యకలాపాల లాభం 14.3 శాతం వృద్ధితో రూ. 1,234 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ 2.6 శాతానికి మెరుగుపడగా, పునర్వ్యవస్థీకరణ తరువాత తొలిసారిగా త్రైమాసిక ఆస్తులపై రాబడి ఒక శాతం స్థాయిని తాకినట్లు బ్యాంకు వెల్లడించింది. డిపాజిట్ల విభాగంలోనూ స్థిరమైన పురోగతి నమోదైంది. చిల్లర మరియు శాఖల ఆధారిత డిపాజిట్లు 9 శాతం పెరిగి రూ. 1,73,305 కోట్లకు చేరుకున్నాయి. చెల్లింపు మరియు పొదుపు ఖాతాల డిపాజిట్లు 8.5 శాతం వృద్ధితో రూ. 99,483 కోట్లుగా నమోదయ్యాయి. వాణిజ్య బ్యాంకింగ్, పెద్ద సంస్థలు, క్రెడిట్ కార్డుల విభాగాల్లో రుణాల పెరుగుదలతో నికర రుణాలు 5.2 శాతం వృద్ధిని సాధించి రూ. 2,57,451 కోట్లకు చేరుకున్నాయి. ఆస్తుల నాణ్యతలో గణనీయమైన మెరుగుదల కనిపించింది. స్థూల నిరుపయోగ ఆస్తుల నిష్పత్తి 1.5 శాతానికి తగ్గగా, నికర నిరుపయోగ ఆస్తుల నిష్పత్తి 0.3 శాతంగా స్థిరంగా కొనసాగింది. రుణాల్లో జారింపులు తగ్గుముఖం పట్టి 1.6 శాతానికి చేరాయి. నిరుపయోగ ఆస్తుల కోసం కేటాయింపులు కూడా తగ్గడం బ్యాంకు ఆర్థిక స్థిరత్వాన్ని సూచిస్తోంది.

చెల్లింపు పొదుపు ఖాతాల నిష్పత్తి 34 శాతానికి పెరగడం విశేషం. చిన్న చిన్న డిపాజిట్ల వాటా 66.2 శాతానికి చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించాల్సిన 80 కొత్త శాఖల్లో 76 శాఖలను ఇప్పటికే ప్రారంభించినట్లు బ్యాంకు తెలిపింది. ఇటీవల యెస్ బ్యాంక్ జాతీయ స్థాయి బ్యాంకింగ్ సూచీ అయిన నిఫ్టీ బ్యాంక్లో చోటు దక్కించుకుంది. పెట్టుబడి మార్కెట్ కార్యకలాపాల్లో ప్రతిభ కనబరిచినందుకు బొంబాయి స్టాక్ ఎక్స్చేంజ్ నుండి ప్రశంసలు అందుకుంది. అదనంగా, జీవిత బీమా సేవల విస్తరణకు భారత జీవిత బీమా సంస్థతో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. డిజిటల్ చెల్లింపుల రంగంలో విస్తరణ కోసం భారతపేతో కలిసి వాయిదా చెల్లింపు సదుపాయాన్ని ప్రారంభించింది.

## స్మార్ట్‌ఫోన్ రంగాన్ని మలుపు తిప్పనున్న మీడియాటెక్ కొత్త చిప్‌సెట్‌లు




హైదరాబాద్, మేజర్ న్యూస్: ప్రపంచ ప్రఖ్యాత సెమీకండక్టర్ సంస్థ మీడియాటెక్, నేడు ఢిల్లీలో జరిగిన మీడియాటెక్ టెక్ డే 2026లో తన సరికొత్త ఫ్లాగ్‌షిప్ చిప్‌సెట్‌లు డైమెన్సిటీ 9500 డైమెన్సిటీ 8500లను అధికారికంగా విడుదల చేసింది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్లలో మునుపెన్నడూ లేని విధంగా గేమింగ్ సామర్థ్యాన్ని, ఏజెంటిక్ ఏఐ పనితీరును అందించే లక్ష్యంతో వీటిని రూపొందించారు. డైమెన్సిటీ 9500ఎస్ (ఫ్లాగ్‌షిప్ పనితీరు): ఇది అత్యాధునిక త్రీ ఎన్ఎం ప్రాసెస్‌పై నిర్మించబడింది. ఇందులో 3.73 జిహెచ్జ్ వేగంతో పనిచేసే కార్టెక్స్-ఎక్స్925 అల్ట్రా కోర్ ఉంది. గేమింగ్ ప్రియుల కోసం ఇందులో ఇమ్మోర్తలిస్ -జి925 జీపీయు ని అమర్చారు, ఇది స్మార్ట్‌ఫోన్‌లోనే కన్సోల్ స్థాయి గ్రాఫిక్స్‌ను అందిస్తుంది. ఏజెంటిక్ ఏఐ సామర్థ్యం: ఈ చిప్‌సెట్‌లు జనరేటివ్ ఏఐ పనులను అత్యంత వేగంగా చేయగలవు. రియల్ టైమ్ లాంగ్వేజ్ ట్రాన్స్‌లేషన్, 8కె డాల్బీ విజన్ వీడియో ప్రాసెసింగ్ వంటి పనులు మరింత సులభతరం కానున్నాయి. ఒప్పో (ఒప్పో) మరియు పోకో (పోకో) ప్రకటనలు:ఒప్పో ఇండియా: త్వరలోనే భారతదేశంలో ఒప్పో ఫైండ్ ఎక్స్ 9ఎస్ స్మార్ట్‌ఫోన్‌ను డైమెన్సిటీ 9500ఎస్ ప్రాసెసర్‌తో లాంచ్ చేయనున్నట్లు ఒప్పో ఇండియా కమ్యూనికేషన్స్ హెడ్ గోల్డీ పట్నాయక్ తెలిపారు. పోకో ఇండియా: తమ రాబోయే హై-పెర్ఫార్మెన్స్ ఫోన్లలో ఈ కొత్త చిప్‌సెట్‌ను వాడి, వినియోగదారులకు పవర్-ప్యాక్డ్ అనుభవాన్ని అందిస్తామని పోకో మార్కెటింగ్ లీడ్ కెన్ శేఖర్ ప్రకటించారు. అధికారిక ప్రకటన:డైమెన్సిటీ 9500ఎస్, 8500 లాంచ్‌తో మేము ఫ్లాగ్‌షిప్ అనుభవాన్ని అందరికీ చేరువ చేస్తున్నాం. ఏజెంటిక్ ఏఐ అత్యుత్తమ ఇమేజింగ్ సామర్థ్యాలతో ఈ చిప్‌సెట్‌లు నెక్స్ట్-జెన్ యూజర్ అనుభవాన్ని అందిస్తాయి, అని మీడియాటెక్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ అనూజ్ సిద్ధార్థ్ తెలిపారు.

## ఆటోమెకానికా ఢిల్లీ 2026లో యునో మిండా

**- వినూత్న ఆఫ్టర్‌మార్కెట్ పరిష్కారాల ప్రదర్శన -భవిష్యత్‌కు సిద్ధమైన ఉత్పత్తులు, ప్రత్యామ్నాయ ఇంధన పరిష్కారాలు, ఈవీ ? సిఎన్‌జి శ్రేణిపై దృష్టి**



హైదరాబాద్, మేజర్ న్యూస్ : ప్రముఖ టియర్-1 ఆటోమోటివ్ పరిష్కారాల సరఫరాదారు యునో మిండా, ఫిబ్రవరి 57 వరకు యశోభూమి (), ద్వారకాలో జరిగిన ఆటోమెకానికా ఢిల్లీ 2026లో విజయవంతంగా పాల్గొంది. సంస్థ స్పష్టమైన ఉత్పత్తి జోన్లతో కూడిన స్టాల్‌లో ఈవీ ఉత్పత్తులు, సిఎన్‌జి కిట్లు, అలాయ్ వీల్స్, ట్రాక్టర్ ? కమర్షియల్ సీటింగ్ సొల్యూషన్స్, అధునాతన లైటింగ్ మరియు 4 లూబ్రికెంట్లను ప్రదర్శించింది. టెక్నాలజీ ఎక్స్‌పీరియెన్స్ జోన్ ప్రధాన ఆకర్షణగా నిలిచి, ఇంటరాక్టివ్ స్క్రీన్ల ద్వారా సందర్శకులకు ఉత్పత్తులను డిజిటల్‌గా అనుభవించే అవకాశం కల్పించింది. యునో మిండా ప్రతినిధులు తెలిపిన ప్రకారం, పరిశ్రమ ఎలక్ట్రిఫికేషన్, డిజిటలైజేషన్ దిశగా మారుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన పరిష్కారాలు మరియు సాంకేతిక ఆధారిత మొబిలిటీపై సంస్థ తన కట్టుబాటును ప్రదర్శించింది. "డ్రైవింగ్ ది న్యూ" బ్రాండ్ తత్వానికి అనుగుణంగా ఈ భాగస్వామ్యం ఆవిష్కరణ, సాంకేతిక నాయకత్వం మరియు భవిష్యత్ దృష్టి కలిగిన పరిష్కారాలపై సంస్థ దృష్టిని ప్రతిబింబిస్తూ, ఆఫ్టర్‌మార్కెట్ విభాగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసింది.

## హెయిర్ సంరక్షణకు శ్రీలీల ప్రతినిధిత్వం




ఖైరతాబాద్ మేజర్ న్యూస్ : భారతదేశంలోని ప్రముఖ లక్ష్యస్ఫూర్తితో నడిచే వ్యక్తిగత సంరక్షణ సంస్థ మామాఎర్త్ తన జుట్టు సంరక్షణ విభాగానికి కొత్త ప్రతినిధిగా దక్షిణాది సినీనటి, హిందీ చిత్రసీమలోనూ వేగంగా గుర్తింపు పొందుతున్న శ్రీలీలను నియమించింది. ఈ సందర్భంగా రోజ్‌మేరీ ఆధారిత జుట్టు రాలిక తగ్గించే తలస్నాన ద్రవం కోసం ప్రేమికుల దినోత్సవ ప్రత్యేక ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. యువతతో సాన్నిహిత్యం, సహజమైన ఆకర్షణ కలిగిన శ్రీలీల ఈ సంస్థకు కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తారని నిర్వాహకులు తెలిపారు. సహజ, విషరహిత పదార్థాలతో సమర్థవంతమైన ఉత్పత్తులు అందించాలన్న సంస్థ తత్వానికి ఆమె అనుకూలమని పేర్కొన్నారు. క్రీడాభిమానులతో నిండిన ప్రాంగణం నేపథ్యంగా రూపొందించిన ఈ ప్రచార చిత్రంలో శ్రీలీల, నటుడునర్తకుడు శాంతను మహేశ్వరితో కలిసి కనిపిస్తారు. సన్నిహిత క్షణంలో ఆమె జుట్టులో చేయి వేసినప్పుడు కొద్ది వెంట్రుకలు రాలిపోవడం పెద్ద తెరపై ప్రత్యక్షమవుతూ కథను మలుస్తుంది. అనంతరం రోజ్‌మేరీ, మెంతుల సారాలతో రూపొందించిన తలస్నాన ద్రవాన్ని పరిచయం చేస్తూ, జుట్టు రాలికను తగ్గించి దృఢంగా మారుస్తుందని వివరించారు. చివర్లో ఆరోగ్యంగా, ఘనంగా మెరిసే జుట్టుతో శ్రీలీల మళ్లీ ప్రాంగణంలోకి ప్రవేశించడం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది.
ఈ ప్రచారం గురించి శ్రీలీల మాట్లాడుతూ, రోజువారీ జీవితంలో ఎదురయ్యే జుట్టు రాలిక సమస్యను అతిశయోక్తులు లేకుండా సరదాగా, నిజాయితీగా చూపించామని తెలిపారు. సహజ పదార్థాలతో, నిరూపిత ఫలితాలు ఇచ్చే ఉత్పత్తుల పట్ల తనకు విశ్వాసం ఉందని ఆమె పేర్కొన్నారు. యువతతో మరింత అనుబంధాన్ని పెంపొందించుకోవాలన్న లక్ష్యంతో ఆమెను జుట్టు సంరక్షణ విభాగానికి ముఖచిత్రంగా ఆహ్వానించామని సంస్థ ఉన్నతాధికారులు వెల్లడించారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విడుదలైన ఈ ప్రచార చిత్రం సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన పొందుతోంది. యువతలో జుట్టు సంరక్షణపై అవగాహన పెంచడమే ప్రధాన ఉద్దేశమని సంస్థ వర్గాలు తెలిపాయి. సహజ పదార్థాలతో తయారైన ఉత్పత్తులపై పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో మరిన్ని సృజనాత్మక ప్రచార కార్యక్రమాలతో ముందుకు రావాలని సంస్థ యోచిస్తున్నట్లు సమాచారం.

# శారదాంబ.. పాహిమాం



నల్లకుంట, మేజర్ న్యూస్: మాఘమాసం శుక్రవారం సందర్భంగా నల్లకుంట లోని శంకరమఠంలో కోలువైన శ్రీ శారదాంబకు పలు విశేష పూజలు నిర్వహించారు. పండితులు సంప్రదాయబద్దంగా కుంకుమార్చన జరిపారు. వేద మంత్రాలతో స్వర్ణ కమల పూజ నిర్వహించారు. శంకరమఠం ప్రాంగణం శ్రీ లక్ష్మీ నారాయణ హృదయం పారాయణం తో ప్రతిధ్వనించింది. ఈ కార్యక్రమంలో శంకరమఠం ధర్మాధికారి చింతలపాటి శ్రీనివాసమూర్తి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## సేజ్‌బ్రుక్ ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్ ప్రారంభం430 ఏళ్ల చరిత్ర కలిగిన విట్‌గిఫ్ట్ స్కూల్ (యూకే)

## నాయకత్వ నిర్వహణలో ఏర్పాటు12 నెలల వయస్సు నుంచే పిల్లల కోసం 'బిగినింగ్స్' ప్రోగ్రామ్ ప్రారంభం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రోగ్రెసివ్ అంతర్జాతీయ విద్యలో ప్రముఖ స్థానంలో ఉన్న సేజ్‌బ్రుక్ ఇంటర్నేషనల్ స్కూల్, వెస్ట్ హైదరాబాద్‌లోని తన నూతన క్యాంపస్‌ను ఫిబ్రవరి 6, 2026న అధికారికంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమం యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రతిష్టాత్మక విట్‌గిఫ్ట్ స్కూల్ సీనియర్ నాయకత్వ సమక్షంలో నిర్వహించబడింది. ఈ ప్రారంభంతో సేజ్‌బ్రుక్ మరియు విట్‌గిఫ్ట్ స్కూల్‌ల మధ్య దీర్ఘకాలిక విద్యా భాగస్వామ్యం అధికారికంగా ప్రారంభమైంది. విట్‌గిఫ్ట్ స్కూల్ ప్రతినిధులుగా హెడ్‌మాస్టర్ మిస్టర్ టోబీ సెత్, డైరెక్టర్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ మిస్టర్ జాన్ చిషోలం, అలాగే సేజ్‌బ్రుక్ ఇంటర్నేషనల్ స్కూల్ హెడ్ ఆఫ్ స్కూల్ మిస్ జోయ్ ఎల్. హౌసర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా పాఠ్యక్రమ సహ-రూపకల్పన, అధ్యాపకుల అభివృద్ధి, అంతర్జాతీయ విద్యా మార్గాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా విట్‌గిఫ్ట్ స్కూల్ హెడ్‌మాస్టర్ టోబీ సెత్ మాట్లాడుతూ,"ఈ క్యాంపస్ స్పష్టమైన లక్ష్యంతో కూడిన విద్యను ప్రతిబింబిస్తోంది. విలువల ఆధారిత విద్యపై సేజ్‌బ్రుక్ చూపుతున్న నిబద్ధత ఈ భాగస్వామ్యాన్ని మరింత అర్థవంతంగా మారుస్తోంది. పిల్లలను భవిష్యత్తుకు సిద్ధం చేసే వాతావరణాన్ని ఇక్కడ నిర్మిస్తున్నారు" అని అన్నారు. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న సేజ్‌బ్రుక్ క్యాంపస్‌లో సస్టైనబిలిటీ, విద్యార్థుల శ్రేయస్సు, భవిష్యత్ అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించారు. సేజ్‌బ్రుక్ ఇంటర్నేషనల్ ఫౌండింగ్ పార్ట్‌నర్ మరియు సుచిత్ర అకాడమీ వ్యవస్థాపకులు మిస్టర్ ప్రవీణ్ రాజు మాట్లాడుతూ "సేజ్‌బ్రుక్ అనేది దృష్టి, భాగస్వామ్యం, ఉద్దేశ్యం కలిసిన ఆలోచన. గ్లోబల్ స్థాయి విద్యను హైదరాబాద్‌కు తీసుకురావడంతో పాటు నైతిక విలువలు, సంరక్షణ, సమాజంతో అనుబంధం ఉన్న విద్యాసంస్థగా దీన్ని రూపొందించాం. విట్‌గిఫ్ట్ స్కూల్‌తో భాగస్వామ్యం ద్వారా ఇది ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా ఎదుగుతుంది" అని తెలిపారు. సేజ్‌బ్రుక్ విద్యా తత్వాన్ని వివరిస్తూ హెడ్ ఆఫ్ స్కూల్ మిస్ జోయ్ ఎల్. హౌసర్ మాట్లాడుతూ "సేజ్‌బ్రుక్‌లో ప్రతి చిన్నారిని ఒక ఆలోచనాశీలి, అన్వేషకుడిగా భావిస్తాం. మా పాఠ్యక్రమం ఐబీ ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్, మాంటెసోరి, రెజియో ఎమిలియా విధానాల ప్రేరణతో రూపొందింది. పిల్లలు ప్రశ్నలు, కదలిక, ప్రకృతి మరియు నిజమైన అనుభవాల ద్వారా ఆనందంగా నేర్చుకుంటారు" అని తెలిపారు.

## అగ్రవర్ణ పార్టీ నాయకుల్లారా ఏ ముఖం పెట్టుకొని బీసీల ఓట్లు అడుగుతారు?

హైదరాబాద్, మేజర్ న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు జరుగుతున్న నిరంతర అన్యాయాలపై బీసీ సంఘాలు, బీసీ మేధావులు, ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఉన్న మూడు ప్రధాన రాజకీయ పార్టీలుబీసీలకు అనుకూలంగా కాకుండా, స్పష్టంగా బీసీ వ్యతిరేక విధానాలతోనే వ్యవహరిస్తున్నాయని ఈ సందర్భంగా ఖండించినారు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వైఖరి పూర్తిగా బీసీ వ్యతిరేకమని మరోసారి రుజువైంది. మున్సిపల్ ఎన్నికల సందర్భంలో బీసీలకు వ్యతిరేకంగా జారీ చేసిన ప్రభుత్వ జీవోపై కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్న వ్యక్తికే కౌన్సిలర్‌గా బీ-ఫామ్ ఇవ్వడం జరిగింది. ఇది బీఆర్ఎస్ పార్టీకి ఉన్న అసలైన ఓబీసీ/బీసీ దృక్పథాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చింది.బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో బీసీలకు ఉన్న స్థానిక సంస్థల రిజర్వేషన్లు 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించబడ్డాయి.బడ్జెట్‌లో బీసీలకు నిధులు కేటాయించినట్లు చూపించి, వాటిని పూర్తిగా విడుదల చేయకుండా తీవ్రమైన అన్యాయం జరిగింది.బీసీ రిజర్వేషన్ల కోసం ఒక్కరోజు కూడా నిజాయితీతో ఉద్యమం చేయని పార్టీగా బీఆర్ఎస్ నిలిచింది.కులగణన అంశంలో భాగస్వామ్యమై ఉన్నప్పటికీ, దాని ఫలితాలను అమలు చేయడంలో పూర్తి వైఫల్యం చూపింది.

ఇక పార్టీ .నామినేటెడ్ పోస్టులన్నింటినీ అధికంగా అగ్రవర్ణాలతో నింపి, బీసీలను పక్కన పెట్టింది.అలాగే బీజేపీ పార్టీ ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీలకు 42%శాతం రిజర్వేషన్లకు రాజ్యాంగ పరిరక్షణ కల్పించే బిల్లు ప్రవేశపెట్టాలని 9 వ షెడ్యూల్ లో చేర్పించాలని డిమాండ్ చేస్తున్నాము. అడగకుండానే రిజర్వేషన్లు ఇస్తున్న కేంద్ర పాలకులు, బీసీలు కు మాత్రం మోకాలు అడ్డం పెట్టటం అన్యాయమని పేర్కొన్నారు.కేంద్ర బడ్జెట్‌లో కూడా బీసీలకు తీవ్రమైన అన్యాయం జరిగింది. రాష్ట్ర స్థాయిలోనూ, జాతీయ స్థాయిలోనూ బీసీలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాల్సిందే అని డిమాండ్ చేసారు.ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని ప్రకటించి, గత రెండు సంవత్సరాల్లో కేటాయించాల్సిన నిధుల్లో



కనీసం పది శాతం కూడా ఖర్చు చేయకపోవడం కాంగ్రెస్ పాలకుల బీసీ వ్యతిరేక ధోరణీ కి నిదర్శమన్నారు

అదేవిధంగా యూనివర్సిటీల్లో ఈక్విటీ రూల్స్‌ను తక్షణమే అమలు చేయాలి.బీసీలకు సంబంధించిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలి.లేకపోతే రాబోయే కాలంలో బీసీలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో భారీ ఉద్యమాలకు సిద్ధమవుతారని ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నాము. అని తెలియ చేశారు.ఈ సభలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షులు బాలగోని బాలరాజ్ గౌడు ప్రసంగిస్తూ, మూడు ప్రధాన పార్టీల బీసీ వ్యతిరేక వైఖరిని తీవ్రంగా ఖండించారు.ఎన్నికల్లో బీసీల చేతిలో చావు దెబ్బ తినక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో:బీసీ ఇంటెలెక్చ్యువల్ ఫోరం తరపున శ్రీకాంత్, లింగేశ్ యాదవ్,ఉస్మానియా యూనివర్సిటీ బీసీ జాక్ లీడర్ రమేష్ యాదవ్ పాల్గొని యూనివర్సిటీ ఈక్విటీ రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో

వెంకన్న దుర్గయ్య గౌడు, ఎలికంటి విజయ్ కుమార్ , అంబాల నారాయణ గౌడు ,బైరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వ్యాప్తంగా ఊపందుకున్న రైలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు

-ప్రస్తుత బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు మంజూరు - తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్‌లో రూ.5,454 కోట్లు కేటాయింపు



హైదరాబాద్, మేజర్ న్యూస్ : పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రం విస్తరిస్తున్న పట్టణ కేంద్రాలు, వ్యూహాత్మక స్థానంతో ఆర్థిక వృద్ధి, చలనశీలతకు మద్దతు ఇవ్వడానికి పటిష్టమైన రైల్వే అనుసంధా నంపై ఎక్కువగా ఆధార పడింది. 2014 తర్వాత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత, రాష్ట్ర వ్యాప్తంగా రైలు మౌలిక సదుపాయాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం నిరంతరం తగినంత బడ్జెట్ కేటాయింపులను అందుకుంటోంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నప్పటికంటే ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణకు సగటు వార్షిక రైల్వే బడ్జెట్ కేటాయింపు, 2026-27 ఆర్థిక సంవత్సరంలో పెరిగి 5454 కోట్లకు చేరుకుంది. 2009-14 సంవత్సరాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించి న వార్షిక సగటు బడ్జెట్ రూ. 886 కోట్లతో పోలిస్తే ఇది మెరుగైన కేటాయింపు. ఈ మెరుగైన బడ్జెట్ మద్దతు భారతీయ రైల్వేలు తెలంగాణలో మౌలిక సదుపాయాల కల్పనను గణనీయంగా పెంచడానికి వీలు కల్పించింది. 2014 నుండి, రాష్ట్రంలో 900 కిలోమీటర్లకు పైగా నూతన రైల్వే ట్రాక్‌లు నిర్మించబడ్డాయి. విద్యుదీకరణ కూడా వేగంగా అభివృద్ధి చెందింది, 2014 నుండి 1,115 కిలోమీటర్లు విద్యుదీ కరించబడి, దీనితో తెలంగాణ 100 శాతం విద్యుదీకరించిన రాష్ట్రంగా మార్చింది. 2014 నుండి తెలంగాణలో అనేక ముఖ్యమైన రైల్వే ప్రాజెక్టులు పూర్తిగా ప్రారంభమయ్యాయి. ప్రాంతీయ అనుసంధానాన్ని, సామర్థ్యాన్ని బలోపేతం చేస్తున్నాయి. వీటిలో పెద్దపల్లినిజామాబాద్, జగ్గయ్యపేటజాన్‌పహాడ్, అక్కన్న పేట్-మెదక్, భద్రాచలం రోడ్‌సత్తుపల్లి వంటి నూతన రైల్వే లైన్ ప్రాజెక్టులు గతంలో వెనుకబడిన ప్రాంతాలను రైలు నెట్‌వర్క్‌కు అనుసంధానించాయి. సికింద్రాబాద్‌మహబూబ్‌నగర్ డబ్లింగ్ వంటి సామర్థ్య పెంపు పనులు, కాజీపేట-బల్హార్షా, కాజీపేట-విజయవాడ మధ్య మూడవ లైన్ పనులు పూర్తి కావస్తు న్నాయి. ఇవి రద్దీగా ఉండే మార్గాలలో రద్దీని తగ్గిస్తాయి. ఎం. ఎం. టీ.ఎస్ రెండవ దశ ప్రారంభం హైదరాబాద్ ప్రాంతంలో సబర్బన్ రైలు అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తూ రోజువారీ ప్రయాణికులకు నమ్మకమైన, అందుబాటు ధరల్లో ప్రయాణ ఎంపికను అందిస్తుంది.

## ఎస్ఎస్ఆర్ రేట్లపై పరిశీలన విద్యుత్ గుత్తేదారులకు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి భరోసా



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఎన్‌పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ కాంట్రాక్టు పనులు చేస్తున్న గుత్తేదారులకి ఎస్ ఎస్ ఆర్ ధరల పెంపుపై పరిశీలిస్తానని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ గుత్తేదారుల సంఘం రూపొందించిన 2026 డైరీ,క్యాలెండర్ ను శుక్రవారం సాయంత్రం సీఎండీ వరుణ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్‌కే మాజీద్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యన్ పర్వతాలు ఈసాక్ కే యాదయ్య జలీల్ లింగయ్య తదితరులు హాజరైనారు. సీఎండీ కీ ఎస్ఎస్ఆర్ రేట్లు తదితర విషయాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సి.యం.డి వరుణ్ రెడ్డి దృష్టికి ఎస్.ఎస్ ఆర్ రేట్ల విషయంతో పాటు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ కే మాజిద్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.పర్వతాలు,ఇషాక్, యాదయ్య, జలీల్,లింగయ్య తదితరుల బృందం ఆయన దృష్టికి తీసుక వచ్చారు. అందుకు స్పందించిన ఆయన వారం రోజుల మీదట సమావేశం ఏర్పాటు చేసి సమీక్షిస్తామని చెప్పారు. వచ్చే వారం లో మీ సమస్య ల గురించి మాట్లాడు దాము రండి వాటిని పరిష్కారించే టట్లు గా చూదాం అని తెలిపారు . ఈ సందర్బంగా జరిగిన కార్యక్రమములో వివిధ జిల్లా ల నుండి విద్యుత్ కాంట్రాక్టర్స్ పాల్గొన్నారు

## ఎనిమిది కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

### కోదండరాం కు తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి వినతి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : శుక్రవారం రోజున తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లాపు దుర్గారావు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కోశాధికారి బోరెద ప్రవీణ్ కుమార్ తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ని వారి కార్యాలయం మోజంజాహీ మార్కెట్ నందు కలిసి 8 కులాలకు కార్పొరేషన్లు (సారోల్ల/ సోమవంశ క్షత్రియ, బొందిలి, ఫకీర్, వంజరి, దూదేకుల, తుర్క కాశ, ఆరెకటిక, శిష్టకరణం) ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ప్రొఫెసర్ కోదండ రాం ని కోరారు. దీని కి ఆయన సానుకూలంగా స్పందిస్తూ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని చేర్చింది కనుక వారి దృష్టికి తీసుకు వెళ్లి కార్పొరేషన్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాన ని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జాజే రావు వేదాకర్ కోశాధికారి శెట్టి వరంగల్ పద్మారావు ఉపాధ్యక్షుడు లోలపురి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికా సాధికారత- భద్రత అంశంపై అవగాహన



మణికొండ,మేజర్ న్యూస్: శ్రీ గాయత్రి బ్రాహ్మణ ఐక్య వేదిక మణికొండ వారి ఆధ్వర్యంలో మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు బాలికా సాధికారత మరియు వారి భద్రత అంశం పై అవగాహన సదస్సు జరిగింది. సీనియర్ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనర్ మరియు సైకాలజిస్ట్ శ్రీమతి నళిని టీచర్ , బెంగళూరు ఈ కార్యక్రమం లో వక్త గా వ్యవహరించారు. సుమారు 300 మంది బాలికలు ఈ కార్యక్రమానికి హాజరు అయ్యారు. ఈ కార్యక్రమం లో శ్రీ గాయత్రి బ్రాహ్మణ ఐక్య వేదిక కార్యనిర్వాహక సభ్యులు ముక్తేశ్వర రావు, శశికిరణ్, సుబ్రహ్మణ్యం, జ్యోతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ నిరంజన్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.